

ఆఈఈటీ-2025కు 93.46% మంది హాజరు

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో (సెల్ఫ్ సపోర్టు) ప్రవేశాలకు సోమవారం ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఆఈఈటీ-2025 (ఆంధ్ర యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్)కు 93.46 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రవేశ పరీక్షకు మొత్తం 6,028 మంది దరఖాస్తు చేసుకోగా, 5,634 మంది (93.46 శాతం) హాజరయ్యారు. ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ గాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ కాలేజీ, లంకపల్లి బుల్లయ్య కాలేజీల్లో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

క్రీడా ప్రాంగణాలు ప్రైవేటుకు ధారాదత్తం



ఒక్కొక్కటిగా అప్పగిస్తున్న జీవీఎంసీ

- ఇప్పటికే స్పోర్ట్స్ ఎరీనా, ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ కట్టబెట్టిన అధికారులు
- భారీగా ఫీజులు వసూలుచేస్తున్న నిర్వాహకులు
- ఆటలకు దూరమైపోతున్న పేద, మధ్యతరగతి వర్గాలు
- తాజాగా రూ.15 కోట్లతో ఆధునికీకరించిన స్వర్ణభారతి ఇండోర్ స్టేడియాన్ని ప్రైవేటుకు అప్పగించే యోచన?
- క్రీడా సంఘాల ఆందోళన





లీజుకి ఇచ్చేసిన ఎంవీపీకాలనీలో స్పోర్ట్స్ ఎరీనా (ఇన్‌సెట్‌లో) ప్రైవేటు వ్యక్తులకు అప్పగించిన బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

చిన్నారులు, యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు ఏర్పాటుచేసిన జీవీఎంసీ క్రీడా ప్రాంగణాలు ఒక్కొక్కటి ప్రైవేటుపరమైపోతున్నాయి. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన స్టేడియాల నిర్వహణ బాధ్యతను నగర పాలక సంస్థ...ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు కట్టబెడుతోంది. నిర్వాహకులు భారీగా ధరలు నిర్ణయించి పిల్లల తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్నారు.

స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంతోపాటు బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివిధ క్రీడాంశాల్లో వందలాది మంది క్రీడాకారులు నిత్యం సాధన చేసేవారు. ఉన్నత సదుపాయాలు, ఉత్తమ కోచ్‌లు అందుబాటులో ఉండడంతో నైపుణ్యం సాధించేవారు. రాష్ట్ర, జాతీయస్థాయి టోర్నమెంట్లలో సత్తాచూపి నగరానికి ఖ్యాతి తెచ్చేవారు. వారిని మరింత ప్రోత్సహించేలా జీవీఎంసీ చర్యలు ఉండాలి. కానీ కొంతమంది అధికారులు స్వలాభం కోసం స్టేడియాలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టేస్తున్నారు. నిర్వాహకులు వ్యాపార దృక్పథంతో భారీ ఫీజులు వసూలుచేస్తున్నారు. దీంతో డబ్బున్నవారే ఆయా స్టేడియాల్లో అడుగుపెట్టగలుగుతున్నారు. ప్రతిభ ఉన్నా సాధనకు అవకాశం లేక సాధారణ కుటుంబాల వారు ఆశలు చిదిమేసుకుంటున్నారు.

ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా కాలేజీ మైదానంలో టీడీపీ ప్రభుత్వ హయాం (2015)లో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద రూ.4.5 కోట్లతో ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా కాంప్లెక్స్ నిర్మాణం ప్రారంభించారు. బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులు, స్విమ్మింగ్‌పూల్ నిర్మించారు. నిర్మాణం చివరి దశలో ఉండగా వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో పనులు ఆలస్యమయ్యాయి. పూర్తయిన తర్వాత జీవీఎంసీ స్టేడియం నిర్వహణ ... మిగతా 6వ పేజీలో

ఖాకీ అడ్డదారి!



రక్షణకు కేటాయించిన గన్‌మెన్‌కు ఇంటి పనులు అప్పగింత

- పెంపుడు కుక్కలను సాకేదీ వారే
- పెందుర్తిలో విలాసవంతమైన భవన నిర్మాణం
- చింతపల్లి మండలం అన్నవరంలో మరో నిర్మాణం
- ఏసీబీకి అందిన ఫిర్యాదు

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

అతనో పోలీస్ అధికారి. మావోయిస్టులకు సంబంధించిన కీలకమైన సమాచారాన్ని సేకరించగలిగినందుకు శాఖాపరంగా ప్రత్యేక గుర్తింపు లభించింది. ప్రభుత్వం రెండు పదోన్నతులు ఇచ్చింది. అయితే మావోయిస్టుల నుంచి ముప్పు ఉందని భావించి ఆయన రక్షణకు సుమారు పది మంది గన్‌మెన్‌ను కేటాయించింది. అయితే సదరు అధికారి...వారితోనే ఇంటి పనులు (పెంపుడు కుక్కను సాకడం, ఇంటీరియర్, కార్పెంటర్ పనులు చేసేవారికి సహాయకులు ఉండడం) కూడా అప్పగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



పెందుర్తి సమీపంలోని చినముషిడివాడలో నిర్మాణంలో ఉన్న భవనం



పోలీసు అధికారి కొత్త ఇంట్లో కార్పెంటరీ పనులు చేస్తున్న గన్‌మన్



అల్లూరి జిల్లా చింతపల్లి మండలం అన్నవరంలో గిరిజనుడి పేరుతో స్థలం కొనుగోలు చేసి నిర్మిస్తున్న రిసార్టు

పోలీస్ శాఖలో చిరుద్యోగిగా విధుల్లో చేరిన ఆయన ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు స్టేషన్లతో పాటు మావోయిస్టుల వ్యవహారాలను పర్యవేక్షించే విభాగంలో పనిచేశారు. ఆ సమయంలో మావోయిస్టులకు సంబంధించిన కీలక సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు అందించారు. దీంతో ఆయనకు రెండుసార్లు యాగ్జిలరీ ప్రమోషన్లు (ప్రత్యేక పదోన్నతి) లభించి, ప్రస్తుతం ఉన్నత హోదాలో ఉన్నారు. ప్రభుత్వం అతని భద్రతకు సుమారు పది మంది గన్‌మన్‌ను కేటాయించింది. ఆ తరువాత నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ... మిగతా 6వ పేజీలో

కృష్ణాపురంలో ఎంఎస్ఎంఈ పార్కు

నేడు శంకుస్థాపన

- మొత్తం 52.13 ఎకరాలు కేటాయింపు
- తొలిదశలో 21.72 ఎకరాల్లో 163 ప్లాట్లు
- మౌలిక సదుపాయాల కల్పనకు రూ.12.4 కోట్లు



కృష్ణాపురంలో చదునుచేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కు స్థలం

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి):

పద్మనాభం మండలం కృష్ణాపురంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కుకు మంగళవారం శంకుస్థాపన చేయనున్నారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్కు నెలకొల్పాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా భీమిలి నియోజకవర్గానికి సంబంధించి కృష్ణాపురంలో పార్కు ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఇందుకోసం సర్వే నంబర్ 93లో 52.13 ఎకరాలు కేటాయించింది. అందులో తొలి దశలో 23.72 ఎకరాలను అభివృద్ధి చేస్తారు. 300 చదరపు మీటర్ల చొప్పున 163 ప్లాట్లుగా విభజించనున్నారు. పార్కు అభివృద్ధి, ప్లాట్లు విభజన, అమ్మకాలు, తరువాత నిర్వహణ వంటివి ఏపీఐఐసీ చూసుకుంటుంది. ప్రస్తుతం తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ సౌకర్యం వంటివి కల్పించేందుకు రూ.12.4 కోట్లు కేటాయించారు. దీనికి సంబంధించి టెండర్లు ఆహ్వానించనున్నారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం పార్కుకు శంకుస్థాపన చేయనున్న క్రమంలో ఏపీఐఐసీ డీజీఎం బడగల హరిధర్ సోమవారం అక్కడ పనులను పర్యవేక్షించారు. పొదలు తొలగింపు, లెవెలింగ్ పనులు వేగంగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. కాగా పార్కులో మౌలిక వసతుల కల్పన తరువాత ప్లాట్లు అమ్మకాలు ప్రారంభిస్తారు. ప్లాట్ల ధరపై ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకోనున్నది. ప్లాట్లు కొనుగోలు చేసే ఔత్సాహికులకు అన్నివిధాలా ప్రోత్సాహకాలు వచ్చేలా జిల్లా పరిశ్రమల కేంద్రం పర్యవేక్షించనున్నది. మంగళవారం ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకర్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్, ఇతర అధికారులు హాజరవుతారు.

నగరంలో 3 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు

- రూ.172 కోట్లతో నిర్మాణం

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి):

పనిచేసే మహిళలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నగరంలో మూడు హాస్టళ్లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని ముడసర్లోవ, మధురవాడ, నరవల్లో గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ పీపీపీ విధానంలో నిర్మిస్తుంది. ఇందుకు సుమారు రూ.172 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఈ హాస్టళ్లపై యాజమాన్య హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. హాస్టళ్ల ఆపరేషన్, భవనాల నిర్వహణ బాధ్యతలు పీపీపీలో అప్పగిస్తారు. భవన నిర్మాణాలకు కేపిటల్ ఇన్వెస్టిమెంట్ స్కీమ్ కింద సాయం చేయడానికి కేంద్ర ఆర్థిక శాఖ ప్రాథమికంగా అంగీకరించింది. ముడసర్లోవలో రెండు ఎకరాల్లో రూ.90.54 కోట్లతో, మధురవాడలో 1.14 ఎకరాల్లో రూ.51.08 కోట్లతో, నరవలో రూ.30.40 కోట్లతో వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణం చేపడతారు.

ఈపీడీసీఎల్ అత్యుత్సాహం

ఆర్ఈసీఎస్ ఉద్యోగులకు అడ్డగోలుగా జీతాల పెంపు

- ఇప్పుడు 2022 పీఆర్సీ వర్తింపు
- పాత తీర్మానాల ప్రకారమే చేశామని అధికారుల బుకాయింపు
- కలెక్టర్ పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్నా ఆగని అక్రమాలు
- ప్రస్తుతం వాచ్‌మన్ జీతం రూ.71,980, డ్రైవర్‌కు రూ.78,171. అటెండర్‌కు రూ.90 వేలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (ఆర్ఈసీఎస్)ను తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్)లో విలీనం చేసినా అక్రమాలు ఆగడం లేదు. సొసైటీ చట్టం కింద ఆర్ఈసీఎస్ ఏర్పాటైంది. అక్కడ వచ్చే లాభాల ఆధారంగా జీతాలు నిర్ణయిస్తారు. అందులో ఆర్థిక అక్రమాలు జరిగాయని తేలడంతో మేనేజింగ్ డైరెక్టర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సొసైటీని తీసుకువెళ్లి ఈపీడీసీఎల్‌కు అప్పగించింది. ఇప్పుడు అక్కడి ఉద్యోగులకు పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ)-2022 జీతాలు ఇవ్వడానికి రంగం సిద్ధం చేశారు. ఒక్కో ఉద్యోగికి నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేలు పెరుగుతుంది. గతంలో పాలకవర్గం తీర్మానం చేసి జీతాలు పెంచేది. ఇబ్బంది ఉండేది కాదు. ఇప్పుడు పాలకవర్గం లేదు. ఎలా జీతాలు పెంచారనేదే ప్రశ్న.

ప్రస్తుతం సొసైటీలో పనిచేసే వాచ్‌మన్ జీతం నెలకు రూ.71,980. డ్రైవర్‌కు రూ.78,171. అటెండర్‌కు రూ.90 వేలు. ప్రాజెక్ట్ ఇంజనీర్ జీతం రూ.2.35 లక్షలు. ఇలా లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు మొత్తం 120 మంది నెలకు రూ.1.12 కోట్లు జీతం కింద తీసుకుంటున్నారు. వీరు కాకుండా మరో 492 మంది కాంట్రాక్టు పేమెంట్ వర్కర్లు ఉన్నారు. వీరికి జీతాల కింద రూ.2.16 కోట్లు చెల్లిస్తున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే వాచ్‌మన్ జీతం రూ.7,500 కాగా రెగ్యులర్ వాచ్‌మన్‌కు రూ.72 వేలు ఇస్తున్నారు. అంటే పదింతలు ఎక్కువ.

పాత రికమెండేషన్ ప్రకారం ఇచ్చేస్తున్నారు

ఈపీడీసీఎల్ ఉద్యోగులు ప్రభుత్వ సంస్థకు చెందిన వారు. వారికి పే రివిజన్ కమిషన్ వర్తిస్తుంది. ఆర్ఈసీఎస్ సహకార సంస్థ. వారికి అటువంటివేమీ లేదు. కానీ గతంలో ఈపీడీసీఎల్ ఉద్యోగులకు పీఆర్సీ ఇచ్చినప్పుడల్లా ... మిగతా 6వ పేజీలో

ఆయుష్ కేంద్రాల్లో పంచకర్మ వైద్యం

ప్రాంతీయ కార్యాలయ పరిధిలో 23 చోట్ల అమలు

- దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స
- ఆరోగ్య మందిరాలుగా అభివృద్ధి చేస్తున్న కేంద్రం

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి):

ప్రాచీన ప్రకృతి వైద్యానికి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఆయుష్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న ఆయుష్ డిస్పెన్సరీల్లో ప్రాచీన పంచకర్మ వైద్యాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఆయుర్వేద డిస్పెన్సరీలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా అభివృద్ధి చేస్తోంది.



కొరుప్రోలులో పంచకర్మ వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

ఆయుష్ విభాగం ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 59 డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో 23 డిస్పెన్సరీలను ఆయుష్మాన్ ఆయుర్వేద మందిరాలుగా అభివృద్ధి చేయనున్నారు. వీటిలో దశల వారీగా పంచకర్మ వైద్య సేవలను అందుబాటులోకి తెస్తారు. ఇప్పటికే జోన్ పరిధిలోని అనకాపల్లి జిల్లా కొరుప్రోలు, విజయనగరం పట్టణం, శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో పంచకర్మ వైద్య సేవలను అందిస్తున్నారు. మరికొద్దిరోజుల్లో మరో తొమ్మిది చోట్ల ఈ సేవలను ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆయుష్ ఆర్డీడీ ఝాన్సీ లక్ష్మీబాయికి ఆదేశాలు అందాయి. శ్రీకాకుళం జిల్లాలోని ... మిగతా 6వ పేజీలో



తిరుమల నగర్‌కు ఆనుకొని ఆటోనగర్ ఈ బ్లాకులో ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

కాలుష్య సమస్యకు పరిష్కారం



- గాజువాక ఆటోనగర్ ఈ బ్లాక్ వద్ద వ్యర్థాలు డంప్ చేయకుండా గోడ నిర్మాణం
- అక్కడ ఉన్న చెత్తను కాపులుప్పాడ తరలిస్తామన్న ఐలా కమిషనర్
- సీసీ కెమెరాలు కూడా ఏర్పాటుచేస్తామని వెల్లడి

కూర్మన్నపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని తిరుమలనగర్, సిద్ధార్థ నగర్, పాత వడ్లపూడి, కాళింగుల వీధి, తారకరామా నగర్ వాసులను ఏళ్ల తరబడి వేధిస్తున్న కాలుష్య సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించనున్నది. 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన "అక్షరం అండగా, పరిష్కారమే అజెండా..." కార్యక్రమంతో అందుకు ముందడుగుపడింది. వివరాలిలా ఉన్నాయి.

ఆటోనగర్ ఈ బ్లాకులో గల కర్మాగారాల నుంచి వెలువడే వ్యర్థాలను పక్కనున్న ఖాళీ స్థలంలో వేయడంతో ... మిగతా 6వ పేజీలో



చెట్టు రూపంలో మృత్యువు

- నడుపుతున్న వాహనంపై విరిగిపడ్డ చెట్టు కొమ్మ
- మహిళ దుర్మరణం
- నక్కవానిపాలెం ఏఎంజీ ఆస్పత్రి సమీపంలో సంఘటన

..వివరాలు మెయిన్ 3వపేజీలో

విద్యా మిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన

భీమునిపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర స్టాక్ పాయింట్‌ను రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మి సోమవారం రాత్రి పరిశీలించారు. భీమిలిలో ఏర్పాటు చేసిన ఈ స్టాక్ పాయింట్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు భద్రపరిచారు. పాఠశాలలు తెరిచేలోపు విద్యార్థులకు విద్యా మిత్ర కిట్లు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం మండలాల వారీగా స్టాక్ పాయింట్లు ఏర్పాటుచేసినట్టు ఆమె చెప్పారు.

11న గీతం ప్రవేశపరీక్ష

ఎండాడ/సాగర్‌నగర్,మే 5 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్, సైన్స్, లా, నర్సింగ్, పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 11న గీతం అడ్మిషన్ టెస్టు (గ్యాట్-2025) నిర్వహించనున్నట్టు గీతం అడ్మిషన్ల డైరెక్టర్ జగదీశ్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 42 పట్టణాల్లో ఈ పరీక్ష జరుగుతుందన్నారు.

అనంతుని ఆలయ శిఖర ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభం

పద్మనాభం, మే 5 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు సోమవారం రాత్రి నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక కుంతీమాధవస్వామి ఆలయంలో ముందుగా వేద పండితుల ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, వాస్తు హోమం నిర్వహించారు. అనంతరం స్వామివారి కుంభ కళాపకర్షణ చేపట్టారు. భక్తుల జయ, జయ ధ్వానాలు, కోలాటం నడుమ ఆలయం నుంచి గిరికి శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామివారు పల్లకీపై బయలుదేరగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గిరిపైకి స్వామివారిని పల్లకీపై తోడ్కొని వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె. రాంబాబు, ఈఓ నానాజీబాబు సర్పంచ్ టి.


గిరిపైకి ఉభయ దేవేరులతో బయలుదేరిన పద్మనాభుడు

పాప, పద్దు దంపతులు, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మి, ఎర్నాయుడు దంపతులు, టీడీపీ మండల అధ్యక్షుడు నగేష్‌కుమార్, బీజేపీ నాయకులు రవికుమార్, మహేష్, శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు నారాయణరావు, సన్యాసిరావు, రమణ, రాము, సన్నిబాబు, నరసింగరావు, చిన రమణ పాల్గొన్నారు. కాగా ఉత్సవానికి రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు తరపున చైర్మన్ రవికుమార్ రూ. 25 వేలు విరాళాన్ని ఆలయ ఈఓ నానాజీబాబుకు అందజేశారు. స్వామివారి ఉత్సవాల నిర్వహణకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తున్నామని, రాబోయే రోజుల్లో కూడా తమ ట్రస్టు ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో నగేష్ కుమార్, ఎర్నాయుడు, సన్నిబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ధర్నా

భీమునిపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే 12వ పీఆర్‌సీ కమిషన్ నియామకం, మధ్యంతర భృతి, డీఏలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపుమేరకు ఈ ధర్నా చేపట్టామని తెలిపారు.

ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

భీమునిపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మినీ స్టేడియంలో సోమవారం నుంచి ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. శిక్షణకు వచ్చిన 53 మంది క్రీడాకారులకు జెర్సీలు, ఫుట్‌బాల్స్, ఇతర సామగ్రిని కలిగొట్ల స్నిగ్ధశ్రీ దేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5వ తేదీ వరకూ శిబిరం కొనసాగుతుందని చెప్పారు.

పీజీఆర్ఎస్‌కు 225 ఫిర్యాదులు

మహారాణిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమ స్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 225 ఫిర్యాదులు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు 81, జీవీఎంసీ 79, పోలీసు 14, ఇతర శాఖలకు సంబంధించి 51 ఫిర్యాదులను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు స్వీకరించారు. వినతులు అందుకున్న కలెక్టర్ నేరుగా అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వివిధ శాఖలలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, స్వర్ణాంధ్ర లక్ష్య సాధన సీ4 సర్వే తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. కారణాలు లేకుండా ఫిర్యాదులు పెండింగ్‌లో పెడితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ పునరుద్ఘాటించారు. అనంతరం బాల్య వివాహాల నివారణ ఆవశ్యకతపై సమావేశం నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటీ వారు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాల గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్,


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

డీఆర్వో భవానీ శంకర్ పాల్గొన్నారు.

మాజీ డిప్యూటీ మేయర్‌పై ఫిర్యాదు

మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అక్రమాలు, భూ ఆక్రమణలపై విచారణ చేపట్టాలని 22వ వార్డు కార్పొరేటర్ పీతలమూర్తి యాదవ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 52వ వార్డు ఢిల్లీ పబ్లిక్ స్కూలు ఉన్న భూమి ప్రభుత్వానికి చెందినదని, దీనికి జీవీఎంసీ అనుమతి లేదని, మద్దిపాలెం జర్నలిస్టు కాలనీలో 330 గజాల స్థలం ఆక్రమించుకుని రెండు భవనాలు నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కమనీయం... అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, మే 5 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం : సీఐ

పద్మనాభం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీధర్ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో తిరిగే అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వారి సమాచారం పోలీసులకు తెలియజేయాలని చెప్పారు.

సంక్షేమ పథకాలపై టీడీపీ ప్రచారం

పద్మనాభం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి టీడీపీ నాయకులు మద్ది, తునిపొలం. విజయరాంపురం గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, సీనియర్ సిటిజన్ కార్డు, పీఎం కిసాన్ కార్డు, ఈశ్రామిక కార్డు, ఆరోగ్యశ్రీ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు బుగత ప్రకాశ్, శ్రీనివాసరావు, గిరి, అప్పలనాయుడు, సన్యాశినాయుడు పాల్గొన్నారు.

జూన్ వరకు ఈకేవైసీ గడువు పొడిగింపు

పద్మనాభం రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రేషన్ లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకోవడానికి జూన్ నెలాఖరు వరకు గడువు పొడించినట్టు తహసీల్దార్ కాకర ఆనందరావు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తొలుత ఏప్రిల్ 30 వరకు గడువు ఇవ్వగా, ఇంకా కొందరికి ఈకేవైసీ పూర్తి కాకపోవడంతో గడువు పొడిగించినట్టు చెప్పారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడు సత్యనారాయణను సన్మానించిన గ్రామస్తులు

భీమునిపట్నం (రూరల్), మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణంరాజుపేట ప్రాథమిక పాఠశాలలో పని చేసి పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయుడు గొట్టిపల్లి సత్యనారాయణను మూలకుద్దు గ్రామంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మూలకుద్దు ఉపాధ్యాయుడు దుంపల దాలయ్యబాబు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో కృష్ణా కళాశాల పర్యవేక్షణాధికారి జీవీ అప్పారావు, గంటాన మోహనరావు, రేక అప్పారావు తదితరులు పాల్గొన్నారు. కాగా గత నెల 30న పదవీ విరమణ చేసిన చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి. మురళీమోహన్‌ను డీఈఓ కార్యాలయంలో సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి మురళీమోహన్ చేసిన సేవలను కొనియాడారు.

15 వినతుల స్వీకరణ

కొమ్మాది, మే 5 (ఆంధ్రజ్యోతి) : జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 15 వినతులు స్వీకరించినట్టు జడ్సీ కనకమహాలక్ష్మి తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి 4, పబ్లిక్ వర్క్సుకు సంబంధించి 5, తాగునీటి విభాగానికి 1, రెవెన్యూ 1, పబ్లిక్ హెల్త్ 1, ఎలక్ట్రికల్ విభాగానికి 3 ఫిర్యాదులు వచ్చినట్టు చెప్పారు.

కొండప్ప చెరువు నీరు మళ్లించొద్దు

- ఇరిగేషన్ శాఖాధికారుల ప్రయత్నాలను అడ్డుకున్న రైతులు
- కలుషిత నీటితో వ్యాధుల ముప్పు


సంగివలసలో ఉన్న కొండప్ప చెరువు

తగరపువలస, మే 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని సంగివలస కొండప్ప చెరువులో కలుషిత నీటిని బయటకు విడిచిపెట్టడానికి ఇరిగేషన్ అధికారులు చేసిన ప్రయత్నాలను ఆయకట్టు రైతులు అడ్డుకున్నారు. ఇరిగేషన్ శాఖ సహాయ ఇంజనీర్ విజయకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది చెరువుకు ఉన్న మదుముల నుంచి కలుషిత నీటిని వదలడానికి సోమవారం ప్రయత్నించారు. ఈ విషయం తెలిసిన రైతులు అక్కడికి చేరుకుని నీరు వదిలితే పంట పొలాలు ముంపునకు గురవుతాయని అడ్డుకున్నారు. అయితే స్థానికులు కొందరు చెరువులోని కలుషిత నీటిని విడిచిపెట్టమని అధికారులపై వత్తిడి చేశారు. రైతులు అధికారులు నీరు వదలితే ఊరుకునేది లేదన్నారు. దీంతో పనులు ముందుకు సాగలేదు. నాలుగు రోజుల క్రితం ఈ చెరువులో చేపలు చనిపోయి బయటకు తేలిపోవడంతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సందర్శించి, చెరువును శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ సిబ్బంది రెండు రోజుల క్రితం చనిపోయిన చేపలను బయటకు తీసి పరిసరాలను శుభ్రం చేశారు. కానీ చెరువు నిండా కలుషిత నీరు ఉండడంతో ఆ నీటిని బయటకు వదలాలని అధికారులు నిర్ణయించారు. ఈనేపథ్యంలో వివాదం తలెత్తింది. కాగా గతంలో ఈ చెరువులో నీరు రైతులకు ఎంతగానో ఉపయోగపడేది. దివీస్ యాజమాన్యం చెరువును అభివృద్ధి చేసి చుట్టూ వాకింగ్ ట్రాక్ పార్కు ఏర్పాటు చేసింది. ఈ పనులు చేసే సమయంలో బయటకు నీరు వెళ్లే ఖానాను బాగా ఎత్తు చేశారు. రైతులకు సాగునీరు వెళ్లే మూడు మదుములు పూడికపోయాయి. వీటితోడు సమీపంలో ఉన్న కార్పొరేట్ కళాశాలలకు చెందిన మురుగు నీరు చెరువులో చేరుతోంది. ఈ కారణంగానే చేపలు చనిపోయాయి. ఇప్పుడు కలుషిత నీరు విడిచిపెడితే మరింత ఇబ్బంది వస్తుందని రైతులు చెబుతున్నారు. చెరువులో మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకోమని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఆ నీరు పంట పొలాల్లోకి వెళుతుండడంతో దుర్వాసనకు సాగు పనులు చేయడానికి కూలీలు రావడం లేదని చెబుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సమస్యను జీవీఎంసీ ఇరిగేషన్ అధికారులకు విన్నవించామని, వారు పరిశీలించిన తరువాత చెరువులో నీటిని విడిచిపెట్టడం గురించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

శేరిఖండంలో ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం

పద్మనాభం, మే 5 (ఆంధ్రజ్యోతి) : శేరిఖండం గ్రామంలో షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత సాయినాథునికి పంచామృత, విభూతి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. అలాగే పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. సాయంత్రం స్వామి వారి పల్లకీ సేవ చేశారు. సాయిసేవా ట్రస్టు చైర్మన్ సంగు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నారావు, సత్యసాయి భజన మండలి కన్వీనరు గురునాథరావు, ఎం. నతీష్, ఎస్. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్రమశిక్షణ అవసరం

కొమ్మాది, మే 5 (ఆంధ్రజ్యోతి) :ఉద్యోగులకు క్రమశిక్షణ అవసరమని, అప్పుడే బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించగలరని కమాండెంట్ కేవీ మురళీకృష్ణ అన్నారు. బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్‌గా పని చేసిన పద్మనాభరాజు పదోన్నతిపై శ్రీకాకుళం 1వ బెటాలియన్‌కు బదిలీ కావడంతో సోమవారం ఆయన్ను బెటాలియన్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెటాలియన్‌లో పద్మనాభరాజు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో


పద్మనాభరాజును సన్మానిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

అసిస్టెంట్ కమాండెంట్లు పి. సత్యం, జి. ఇలియసాగర్, వి. నారాయణరావు, ఎస్. మురళీధర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో విజ్ఞానం

సింహాచలం,మే 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుండే ప్రతిఒక్కరూ భగవద్గీత చదవడం అలవాటు చేసుకోవాలని గీతా ప్రచార సాధక్ మింది బాబ్జీ వాసుదేవ అన్నారు. అడివివరం శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరంలో సోమవారం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు భగవద్గీతలోని అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రంథాలయాధికారి ఎస్‌వీ నరసింహం ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించి, బహుమతులు ఇచ్చారు.

గోడ ఎక్కి దూకేస్తానని వ్యక్తి బెదిరింపు



తగరపువలస, మే 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండో వార్డు నమ్మివానిపేటలో ఆవాల ఎర్రయ్య (30) సోమవారం ఉదయం గోడ ఎక్కి దూకేస్తానని బెదిరించాడు. ఆయన తన ఇంటి సమీపంలో గోడ పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని పట్టుకుని అక్కడి నుంచి దూకేస్తానని హెచ్చరికలు చేశాడు. గ్రామస్తులంతా అక్కడికి చేరుకుని, ఎంత సర్ది చెప్పినా కిందకు దిగకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు.పోలీసులు అతనితో మంచిగా మాట్లాడి, సమస్యను పరిష్కరిస్తామని చెప్పి కిందకు దింపించారు. తన భార్య లక్ష్మి విజయనగరంలో ఉన్న పుట్టింటిలో ఉండగా, కుమారుడు (5) అనారోగ్యంతో సంగివలసలో ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పాడు. జీవితంపై విరక్తి చెంది ఇలా చేసినట్టు తెలిపాడు. పోలీసులు అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు.

ఖాకీ అడ్డదారి!

... 5వ పేజీ తరువాయి

పోస్టింగ్ ఇచ్చింది.ఆ సమయంలో అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. రికవరీల్లో కొంత ఇవ్వాలని ఎస్ఐలపై ఒత్తిడి చేసేవారని, స్క్రాప్ దుకాణాల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేయాలని ఆదేశించే వారని ఆరోపణలున్నాయి. ఇటీవల ప్రత్యేక ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు.

సొంత పనులకు గన్‌మెన్

కాగా సదరు అధికారి రక్షణ కోసం ప్రభుత్వం కేటాయించిన గన్‌మెన్‌ను వ్యక్తిగత పనులకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెందుర్తి సమీపంలో ఈ అధికారి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు.అందులో ఇంటీరియర్, కార్పెంటర్ పనులు చేస్తున్న వారికి సహాయకులుగా ఉండాలని ఇద్దరు గన్‌మెన్‌ను ఆదేశించారు.పెంపుడు కుక్కలను చూసుకునే బాధ్యత కూడా వారికే అప్పగించారని తెలిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలోని అన్నవరం వద్ద గిరిజనుడి పేరుతో ప్రైవేటు రిసార్టు నిర్మిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటిపై కొందరు ఇటీవల ఆధారాలతో సహా ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో వారు ప్రత్యేక దృష్టిసారించారని పోలీస్ శాఖలో ప్రచారం.

ఆయుష్ కేంద్రాల్లో పంచకర్మ వైద్యం

... 5వ పేజీ తరువాయి

పూండి, సింగుపురం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని బొండపల్లి, కోమటిపల్లి, బూర్జ, అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, కన్నూరుపాలెం, నర్సీపట్నం కేంద్రాల్లో ఈసేవలు ప్రారంభం కానున్నాయి.

ఈ వ్యాధులకు వైద్యం..

పంచకర్మ వైద్యం అందించేందుకు సిబ్బందిని నియమించారు. మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో 23 ఆరోగ్య మందిరాలకు పురుష, మహిళా థెరపిస్టులను నియమించారు. పంచకర్మ వైద్యంలో వమనం, విరేచన, హస్తి, నస్య, రక్తమోచన అనే ఐదు రకాల చికిత్సతో వ్యాధులను నయంచేస్తారు. దీర్ఘకాలిక వ్యాధులకు కూడా సేవలందిస్తారు. ప్రధానంగా సొరియాసిస్, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, తలనొప్పి, బొల్లి వ్యాధి, సైనసైటిస్, సయాటికా, పక్షవాతం వంటి వ్యాధులకు ఈ వైద్యం అందిస్తారని ఆర్డీడీ తెలిపారు.

వెంకటరావు కుటుంబీకులకు పరామర్శ

సింహాచలం, మే 5 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై గోడ కూలిన ఘటనలో మృతి చెందిన 98వ వార్డు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి యడ్ల వెంకటరావు కుటుంబ సభ్యులను ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ సోమవారం పరామర్శించారు. అడివివరంలోని మృతుడి గృహానికి వెళ్లి వెంకటరావు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

ఈపీడీసీఎల్ అత్యుత్సాహం

... 5వ పేజీ తరువాయి

ఆర్ఈసీఎస్ చైర్మన్, ఎండీ ఒక తీర్మానం చేసి అక్కడి ఉద్యోగులకు కూడా పీఆర్‌సీ ప్రకారం జీతాలు ఇచ్చేసేవారు. అంతా కుమ్మక్కు కావడం వల్ల ఎవరూ ప్రశ్నించలేదు. ఇన్నాళ్లూ నడిచిపోయింది. అయితే మూడేళ్ల క్రితం ఆర్ఈసీఎస్‌ను ఈపీడీసీఎల్‌కు అప్పగించింది. ఆపరేషన్ వ్యవహారాలన్నీ ఈపీడీసీఎల్ చూస్తోంది. బిల్లులు కూడా వసూలు చేసి అక్కడి ఉద్యోగులకు జీతాలు ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 2022లో పీఆర్‌సీ ఇచ్చింది. అప్పటికే ఆర్ఈసీఎస్ వ్యవహారాలపై కోర్టు వివాదాలు నడుస్తుండడంతో దాని గురించి అక్కడి ఉద్యోగులు ఎవరూ మాట్లాడలేదు. ఇప్పుడు స్థానిక నేతలను పట్టుకున్నారు. పాత తీర్మానాల ప్రకారం పీఆర్‌సీని అమలు చేస్తూ జీతాలు ఇచ్చేయడానికి రంగం సిద్ధం చేశారు. ఇందుకు అనకాపల్లి ఎస్ఈ ప్రతిపాదనలు పంపడం, విశాఖలోని కార్పొరేట్ కార్యాలయం ఆమోదించడం జరిగిపోయింది. ఇంతలో లుకలుకలు మొదలు కావడంతో ఒక అడుగు వెనక్కి వేశారు. అయితే ఇప్పటికే చాలామంది ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో పెరిగిన జీతాలు పడిపోయాయి. ఎవరూ నోరు విప్పడం లేదు.

అది చట్ట విరుద్ధం

సొసైటీలో అర్హతల ప్రామాణికంగా కాకుండా రాజకీయ సిఫారసులతో ఉద్యోగాలు ఇచ్చారు. ఈపీడీసీఎల్‌లో రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకాలు జరుగుతున్నాయి. వీరితో సమానంగా సొసైటీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి నిబంధనలు ఒప్పుకోవు. అందుకని పాత పాలకవర్గం అప్పట్లో చేసిన తీర్మానం ప్రకారం 2022 పీఆర్‌సీ అమలు చేస్తున్నామని నోట్ తయారుచేసి, దాని ప్రకారం అందరికీ జీతాలు పెంచేశారు. ఇది కూడా తప్పే. ప్రస్తుతం సొసైటీకి స్వయంగా జిల్లా కలెక్టరే పర్సన్ ఇన్‌చార్జి గా ఉన్నారు. ఆమె అందుకు ఎలా అంగీకరించారనేది అర్థం కావడం లేదు. ఆ జిల్లా ఎస్ఈ సొసైటీ ఇన్‌చార్జి ఎండీగా వ్యవహరిస్తున్నారు. వారిపై రాజకీయ ఒత్తిళ్లు పెట్టి పీఆర్‌సీ అమలు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

తేలుకుట్టిన దొంగల్లా...

పీఆర్‌సీ అమలుపై ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వివరణ కోరితే, సొసైటీ నుంచి ప్రతిపాదనలు వచ్చాయని, బిల్లులు పెడితే ఎప్పటిలాగే ఇచ్చామని, తమ తప్పు ఏమీ లేదని, ప్రత్యేక ఉత్తర్వులు ఏవీ లేవని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అనకాపల్లి జిల్లా అధికారిని వివరణ కోరితే, కార్పొరేట్ కార్యాలయమే జీతాలు విడుదల చేసిందని, తమ ప్రమేయం ఏమీ లేదని, పాత పాలకవర్గం తీర్మానం ఆధారంగా చేసుకొని పీఆర్‌సీ ఇచ్చామని తెలిపారు. జిల్లా స్థాయి సహకార శాఖ అధికారిని దీనిపై ప్రశ్నిస్తే...ఆర్ఈసీఎస్‌కు పీఆర్‌సీ వర్తించదని చాలా స్పష్టంగా చెప్పారు.

పదవీ విరమణ వయస్సు పెంపునకు నిరాకరణ

ఇటీవల అనకాపల్లి నేత ఒకరు ఆర్ఈసీఎస్ ఉద్యోగుల పట్ల ప్రత్యేక ప్రేమ చూపిస్తూ వారికి పదవీ విరమణ వయస్సు 58 నుంచి 62 ఏళ్లకు పెంచాలని సహకార సంస్థకు రాశారు. దీనిపై కమిషనర్ చట్టాలన్నీ పరిశీలించి, అలా కుదరదని, ప్రభుత్వ ఉద్యోగుల్లా 62 ఏళ్ల చేయలేమని గత నెలలో ఫైల్ వెనక్కి తిప్పి పంపించారు. ఇదే సొసైటీలో అక్రమాలపై విచారణ చేయాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో కోరితే ప్రభుత్వం 51ఏ విచారణకు ఆదేశించింది. ఒక వైపు విచారణ జరుగుతూ, మరో వైపు ఆపరేషన్లన్నీ ఈపీడీసీఎల్‌కు అప్పగించిన నేపథ్యంలో అక్కడి ఉద్యోగులకు పీఆర్‌సీ ఎలా ఇస్తారనేది అర్థం కాని వ్యవహారం. ఈ విషయంలో లోపాయికారీ ఒప్పందాలు భారీగా జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు కూడా చేశారు.

కాలుష్య సమస్యకు పరిష్కారం

... 5వ పేజీ తరువాయి

అది డంపింగ్ యార్డుగా మారింది. దాంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా రాత్రిపూట వాహనాల్లో వ్యర్థాలను తీసుకువచ్చి అక్కడ పడేస్తుండేవారు. గుర్తుతెలియని వ్యక్తులు తరచూ యార్డులో వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో పరిసర గ్రామాల వాసులు ఇబ్బంది పడుతుండేవారు. పొగ కారణంగా వృద్ధులు, చిన్నారులు అస్వస్థతకు గురై, శ్వాసకోశ వ్యాధుల బారినపడేవారు. అక్కడ చెత్తను తొలగించాల్సిందిగా జీవీఎంసీ, ఐలా అధికారులకు ఆ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో జనవరి 28వ తేదీన వడ్లపూడిలో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన "అక్షరం అండగా, పరిష్కారమే అజెండా..." కార్యక్రమంలో పాల్గొన్న అధికారుల దృష్టికి స్థానికులు ఈ సమస్యను తీసుకువచ్చారు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. స్పందించిన వార్డు కార్పొరేటర్ బొండా జగన్ కాలనీ వాసులతో కలిసి డంపింగ్ యార్డు వద్ద ఆందోళన చేసి, సమస్యను ఏఎంహెచ్ఓ కిరణ్‌కుమార్, 'ఐలా' కమిషనర్ అయినవిల్లి కిషోర్ దృష్టికి తీసుకువెళ్లారు. కమిషనర్ కిషోర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చొరవచూపారు. అక్కడ చెత్తను తొలగించి, ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టేందుకు రూ.7 లక్షలు మంజూరుచేశారు. ఈ మేరకు ప్రహరీ గోడ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇప్పటికే అక్కడ సెక్యూరిటీని పెట్టామని, ప్రహరీని పూర్తిగా నిర్మించిన తరువాత చెత్తా, చెదారాలను కాపులుప్పాడ తరలిస్తామని, సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తామని ఐలా కమిషనర్ అయినవిల్లి కిషోర్ పేర్కొన్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 'ఆంధ్రజ్యోతి'కి తిరుమలనగర్, సిద్ధార్థ నగర్, కాలనీల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అక్కడ ఇప్పటికే ఉన్న చెత్తా, చెదారాన్ని పూర్తిగా తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రీడా ప్రాంగణాలు ప్రైవేటుకు ధారాదత్తం

... 5వ పేజీ తరువాయి

చూస్తుందని ప్రకటించారు. కానీ జీవీఎంసీలో ఓ ఉన్నతాధికారి తన అస్మదీయుడికి లబ్ధి చేకూర్చేందుకు లీజు పేరుతో అప్ప గించారు. భారీగా ఫీజులు నిర్ణయించడంతో సాధారణ, మధ్య తరగతి క్రీడాకారులు సాధనకు దూరమయ్యారు. బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు స్విమ్మింగ్‌పూల్స్ ఉన్నాయి. వాటిని జీవీఎంసీ నిర్వహించేది. పెద్దలకు నెలకు రూ.200, చిన్నారులకు రూ.100 చొప్పున ఫీజు వసూలుచేసేవారు. ఇక్కడ సాధన చేసినవారిలో ఎంతోమంది రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటారు. కరోనా సమయంలో దీనిని మూసివేయడంతో మరమ్మతులకు గురైంది. తర్వాత రూ.2.5 కోట్లు వెచ్చించి ఆధునికీకరించారు. ఇది అందుబాటులోకి వస్తే స్విమ్మింగ్ సాధనకు అవకాశం ఉంటుందని అంతా ఆశపడ్డారు. చివరకు స్పోర్ట్స్ ఎరీనాను దక్కించుకున్న వ్యక్తికే బినామీ పేరుతో అప్పగించారు. ఉదయం, సాయంత్రం నిర్ణీత సమయాల్లో జీవీఎంసీ నిర్ణయించిన ఫీజు, తర్వాత నిర్వాహకులకు నచ్చిన మొత్తం వసూలుచేసుకునేలా వెసులుబాటు కల్పించారు. దీనిని అలుసుగా తీసుకుని మూడు నెలలు ఫీజు చెల్లించాలని షరతు పెట్టడంతో చాలామంది సాధనకు దూరమయ్యారు.

స్వర్ణభారతిదీ అదే దారి...

మద్దిలపాలెం సమీపంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం పరిస్థితి ఇలాగే ఉంది.ఇక్కడ వందలాది మంది బ్యాడ్మింటన్, కిక్‌బాక్సింగ్ సాధన చేస్తుంటారు. వీరంతా ఏడాదికి వెయ్యి చొప్పున జీవీఎంసీకి ఫీజుగా చెల్లించేవారు. నిపుణులైన కోచ్‌లు మెలకువలు నేర్పుతుంటారు. ఈ స్టేడియానికి జీవీఎంసీ రూ.15 కోట్లతో సీటింగ్, ఫ్లోరింగ్, ఏసీ ప్లాంటు, లైటింగ్ సిస్టమ్ వంటి హంగులు కల్పిస్తోంది. పనులు చివరిదశకు చేరడంతో ఈ నెలలో ప్రారంభించేందుకు జీవీఎంసీ కసరత్తు చేస్తోంది. దీనిపైనా ప్రైవేటు వ్యక్తుల కన్ను పడినట్టు ప్రచారం జరుగుతోంది. అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని క్రీడా సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. మేయర్ పీలా దృష్టిసారించి జీవీఎంసీ ఆధ్వర్యంలోనే నిర్వహణ సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

15 రోజుల్లో ఆరిలోవలో రైతుబజార్ : ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ మే 5 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ రైతుబజార్ 15 రోజుల్లో వినియోగదారులకు అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే వెలగపూడి అన్నారు. తోటగరువు ఎర్ని దుర్గమాంబ గుడికి సమీపంలో నిర్మాణంలో ఉన్న రైతుబజార్‌ను సోమవారం ఆయన సందర్శించారు. 90 శాతం పనుల జరిగాయని, ప్లాట్‌ఫారాలు నిర్మించవలసి ఉందన్నారు.



మృతుడి భార్య లక్ష్మికి చెక్కు అందజేస్తున్న 'పల్లా'

కార్యకర్తలకు అండగా ఉంటాం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు 'పల్లా'

అగనంపూడి, మే 5 (ఆంధ్రజ్యోతి): క్రియాశీలక కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన టీడీపీ కార్యకర్త బొబ్బరి కనకారావు భార్య లక్ష్మికి సోమవారం ఆయన రూ.5 లక్షల బీమా పరిహార చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాలు ఆదపలో ఉంటే ఆదుకునే ఏకైక పార్టీ తమదేనన్నారు. పార్టీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర, నాయకులు సత్యారావు, రమేశ్, మంగరాజు, ముచ్చురాజు, అచ్యుత్, కె.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేతకు నివాళి

పెదగంట్యాడ, మే 5 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నేత, ఉక్కు నిర్వాసిత సంఘం నాయకుడు దివంగత యెల్లేటి రామారావు సేవలు స్ఫూర్తిదాయకమని సీపీఐ రాష్ట్ర సమితి కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఏజే స్టాలిన్ అన్నారు. రామారావు వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు యెల్లేటి శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, జి.ఆనంద్, పి.దుర్గారావు, టీడీపీ నేత పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేదలకు వస్త్రాలు, నిత్యావసర సరకులను పంపిణీ చేశారు.

నీటి సమస్యలను పరిష్కరిస్తాం

పెదగంట్యాడ, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల తాగునీటి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీ కోసం నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి పైపు లైన్ల నుంచి నీటిని సోమవారం ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి రక్షిత తాగునీటిని అందించాన్నదే జీవీఎంసీ లక్ష్యమన్నారు. ప్రజలెవరూ తాగునీటిని వృథా చేయవద్దని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులురాజు, ఉమాశంకర్, అనిత, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అగనంపూడి, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నడక మైదానం వద్ద వాకర్స్ ఆధ్వర్యంలో బీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో సోమవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ట్రస్ట్ చైర్మన్ చైర్మెన్ బలిరెడ్డి నాగేశ్వరరావు చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. దీనిని ప్రయాణికులతో పాటు పాదచారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు రామారావు, సత్యనారాయణ, పూర్ణ, కిశోర్‌బాబు, పైడిరాజు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లలిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **రెట్రో** : మెలోడి, శరత్, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి)
● **అర్జున్ సన్నాఫ్ వైజయంతి** : సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
● **ఓదెల-2** : శ్రీలీలామహల్, సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
● **కోర్ట్** : వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 26, పచ్చిమిర్చి 20, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 28, క్యాబేజీ 13, క్యారెట్ 28 దొండకాయలు 26, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 48, అల్లం (పాతది) 46, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 42, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 34, క్యాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 28, చిలగడదుంపలు 34, కంద 80, గోరుచిక్కుడు 30, దేముడుచిక్కుడు 44, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బూడిద గుమ్మడికాయ 30, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూపులు

దశాబ్దాలు గడుస్తున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ఏపీఐఐసీ నిర్వాసితుల ఆవేదన

కూర్మన్నపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా ఏపీఐఐసీ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏపీఐఐసీ నిర్మాణానికి గాను 1967-72 మధ్య యాదవ జగ్గరాజుపేట, వడ్లపూడి, ఫకీర్‌తక్యా, పరిసర ప్రాంతాలకు చెందిన రైతుల నుంచి సుమారు రెండు వేల ఎకరాల వరకు భూములను సేకరించారు. 1991 నుంచి ఈ ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడంతో వాటిని ఏపీఐఐసీ అభివృద్ధి చేసింది. భూములు కోల్పోయిన నిర్వాసితులకు యాదవ జగ్గరాజుపేట వద్ద సుమారు పదిహేడు ఎకరాలను ఇళ్ల స్థలాల కోసం కేటాయించింది. అయితే నిర్వాసితుల జాబితాలో కొన్ని ఇబ్బందులు తలెత్తడంతో నాటి నుంచి ఇప్పటివరకు ఏ ఒక్కరికీ ఇంటి స్థలం మంజూరు కాలేదు. దీనిపై తాము దశాబ్దాల తరబడి ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని పలువురు నిర్వాసితులు వాపోతున్నారు.

ప్రభుత్వాలు మారుతున్నా..

ప్రభుత్వాలు మారుతున్నా తమకు మాత్రం న్యాయం జరగడం లేదని నిర్వాసిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఉపాధి అవకాశాలు కూడా కల్పించకపోవడంతో నానాపాట్లు పడుతున్నామన్నారు. అప్పట్లో ఎకరాకు రూ.800 మాత్రమే చెల్లించారని పలువురు తెలిపారు. యాదవ జగ్గరాజుపేట, తుంగ్లాం, ఫకీర్‌తక్యా, వడ్లపూడి, తదితర ప్రాంతాల్లో భూములను సేకరించడంతో సుమారు నాలుగు వందల మందికి పైగా రైతులు నిర్వాసితులయ్యారు. వారికి పరిశ్రమల్లో ఉపాధితో పాటు ఇంటి స్థలం కూడా ఇస్తామని అప్పటి అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు.



యాదవజగ్గరాజుపేట ప్రాంతంలో ఏపీఐఐసీ నిర్వాసితుల కోసం కేటాయించిన భూములు

ఇళ్ల స్థలాల మంజూరులో జాప్యం

పరిశ్రమల స్థాపన కోసం భూములు కోల్పోయిన ఏపీఐఐసీ నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు మంజూరులో భాగంగా యాదవ జగ్గరాజుపేటకు చెందిన వారి కోసం పదిహేడు ఎకరాలు, ఫకీర్‌తఖియా వారికి ఐదెకరాలు, వడ్లపూడి నిర్వాసితులకు రెండెకరాల చొప్పున భూమిని కేటాయించింది. అయితే నిర్వాసితులకు ప్లాట్లు వేసి కేటాయించ డంలో జాప్యం జరుగుతుంది. తమకు ఉపాధి కల్పించకపోయినా కనీసం ఇళ్ల స్థలాలనైనా మం జూరు చేయాలని పలుమార్లు జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులను కోరినా ఫలితం లేకుండా పోయిందని పలువురు నిర్వాసితులు పేర్కొంటున్నారు.

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి

ఆటోనగర్ ఆవిర్భావ సమయంలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ టీడీపీ నాయకుడు గొలగాని సన్యాసిరావు ఆధ్వర్యంలో గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు యాదవ జగ్గరాజుపేట గ్రామస్థులు శనివారం వినతిపత్రం అందజేశారు. గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపికను పలుమార్లు చేపట్టినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదని వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కార్పొరేటర్ ముత్యాలు, నాయకులు అప్పారావు, నరసింగరావు, చిన్నోడు, నాయుడు, తదితరులు ఉన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీని పరిశీలించిన డీఈవో

పాఠశాలల పునఃప్రారంభం నాడే విద్యార్థులకు అందేలా చూస్తాం: ప్రేమ్‌కుమార్

గాజువాక, మే 5 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా సంవత్సరంలో పాఠశాలల ప్రారంభానికి నెల రోజుల ముందే పాఠ్య పుస్తకాలను ఉమ్మడి విశాఖ జిల్లాలోని ఎంఈవో కార్యాలయాలకు పంపిణీ చేస్తున్నామని డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. గాజువాకలోని పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. పాఠ్య పుస్తకాల పంపిణీకి సంబంధించిన వివరాలను బుక్ డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావును అడిగి తెలుసుకోవడంతో పాటు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాకు 13,96,964 పాఠ్య పుస్తకాలు అవసరం కాగా ఇప్పటికే 85 శాతం ఇక్కడి కేంద్రానికి చేరుకున్నాయని, ఇప్పటివరకు 7,71,140 పుస్తకాలను ఆయా ఎంఈవో కార్యాలయాలకు తరలించడం జరిగిందన్నారు. గత పది రోజులుగా పాఠ్య పుస్తకాల పంపిణీ జరుగుతుందన్నారు. మరో వారం రోజుల్లో మిగతా పాఠ్య పుస్తకాలను కూడా పంపిణీ చేస్తామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ విద్యా సంవత్సరానికి ముందుగానే ఎంఈవో కార్యాలయాలకు పాఠ్య పుస్తకాలు చేరుకోవటంతో, అక్కడ నుంచి సంబంధిత పాఠశాలలకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గతంలో 110 టైటిల్స్ (110 రకాల పుస్తకాలు) ఉండగా, విద్యార్థులకు పుస్తకాల మోత పెరగడాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం 47 టైటిల్స్‌కు తగ్గించిందని ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే పాఠశాలలకు పుస్తకాలు చేరుతాయన్నారు. ప్రతి విద్యార్థికి పాఠశాల ప్రారంభం రోజునే పుస్తకాలు అందేలా విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇక్కడకు వచ్చిన పాఠ్య పుస్తకాలను ఎప్పటికప్పుడు ఎంఈవో కార్యాలయాలకు చేరేలా చూడాలని మేనేజర్‌కు డీఈవో సూచించారు. డీఈవో వెంట ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, గాజువాక ఎంఈవో సునీత ఉన్నారు.



పుస్తకాల పంపిణీ కార్యాలయంలో డీఈవో ప్రేమ్‌కుమార్, తదితరులు



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ గంగారావు

ఉక్కుటౌన్‌షిప్‌లో ఆధార్ కేంద్రం ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సోమవారం 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్టార్-1 షాపింగ్ కాంప్లెక్స్‌లో ఈ నెల 15వ తేదీ వరకు అధార్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్డులు ఏమైనా సవరణలు, ఫోన్ నంబర్ల మార్పు, బయోమెట్రిక్ వంటి సేవలను టౌన్‌షిప్ వాసులందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

కన్వెన్షన్ సెంటర్‌ను పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర

పెందుర్తిరూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 95వ వార్డు పరిధి చీమలాపల్లి కొండ ప్రాంతంలో రూ.6.24 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్‌ను అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం పరిశీలించారు. పనులతీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జీ, కార్పొరేటర్లు ముమ్మన దేముడు, బళ్ల శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ అదనపు కమిషనర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందరగా రైలు ట్రాక్ నిర్మాణం నిమిత్తం భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని పొర్లుపాలెం మాజీ ఉపసర్పంచి గల్లా వెంకటరమణ ఆధ్వర్యంలో రైతులు మంత్రి రవీంద్రకు వినతి పత్రం ఇచ్చారు.



పనుల తీరు తెలుసుకుంటున్న మంత్రి కొల్లు

సెయింట్ ఆన్స్ అధ్యాపకులకు అభినందనలు

మల్కాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): పరిశోధనా పద్ధతులపై నిర్వహించిన అంతర్జాతీయ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో సెయింట్ ఆన్స్ అధ్యాపకులు ఈపీఎస్ భాగ్యలక్ష్మి, వై.అనసూయదేవి పాల్గొన్నారు. వారిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి సోమవారం అభినందించారు.

టెన్త్ టాపర్స్‌కు వాకర్స్ క్లబ్ సత్కారం

పెందుర్తి, మే 5 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు వెంకటాద్రి వాకర్స్ క్లబ్ సోమవారం సత్కరించింది. విద్యార్థులు గ్రీష్మ, అఖిల్, గీతిక దీక్ష, శిఖరలను సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

పెందుర్తి, మే 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటాద్రి శిఖరంపై కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం బ్రహ్మోత్సవాలకు రుత్వికులు శ్రీకారం చుట్టారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనము, రుత్విగ్వరణము, యాగ కలశార్చన, మత్స్యంగ్రహణం, అంకురారోణంతో రుత్వికులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి మూల విరాట్టును శోభాయమానంగా అలంకరించారు.

వివాహిత ఆత్మహత్య

మల్కాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సోమవారం ములగాడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ములగాడకి చెందిన జీవన్‌కుమార్, కొత్తనక్కావానిపాలేనికి చెందిన పద్మజ (22) ప్రేమించుకుని రెండేళ్ల కిందట పెళ్లి చేసుకున్నారు. వీరి ఎనిమిది నెలల బాబు న్నాడు. సోమవారం జీవన్‌కుమార్ బయటకు వెళ్లాడు. పద్మజ మామ మనవడికి పాలు తెచ్చేందుకు వెళ్లారు. అదే సమయంలో పద్మజ ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరి వేసుకుంది. ఇంటికి తిరిగి వచ్చిన మామ పిలిచినా పలకకపోవడంతో కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. స్థానికుల సాయంతో తలుపులు తెరిచి, ఆమెను ఆస్పత్రికి తరలించగాఅప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. గాజువాక ఎస్ఐ రవి కేసు నమోదు చేశారు.



పద్మజ (ఫైల్ ఫొటో)

'భెల్' భూముల సంరక్షణకు గజిటెడ్ అధికారి

అక్కిరెడ్డిపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల సంరక్షణ చట్టం 1971 ప్రకారం బెల్ హెచ్‌పీవీపీ స్థలాల సంరక్షణ కోసం గజిటెడ్ స్థాయి అధికారిని నియమించేందుకు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ నిర్ణయించింది. ఈ మేరకు మంత్రిత్వశాఖ ఈ నెల ఒకటిన గజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఒకప్పటి చినగంట్యాడ పంచాయతీ తుంగ్లాం, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, మింది సరిహద్దుల్లో ఉన్న బెల్ హెచ్‌పీవీపీకి చెందిన సుమారు 381 ఎకరాల్లో ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపట్టేందుకు అధికారిని నియమించనున్నారు. ఈ భూముల్లో ఉన్న క్వార్టర్స్, కర్మాగారంలోని విభాగాలు, క్రీడా మైదానం సంరక్షించాల్సి ఉంటుంది. కాగా బీహెచ్‌పీవీ 2008లో బెల్‌లో విలీనం కాకముందు నుంచే యాజమాన్యం ఎస్టేట్ అధికారిని నియమించి కొనసాగిస్తుండడం విశేషం.

పెందుర్తిలో ఏపీటీఎఫ్ ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, టీచర్లు

పెందుర్తి, మే 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల విధ్వంస విధానాలకు వ్యతిరేకంగా, సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధనే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏపీటీఎఫ్ చేపట్టిన ఉద్యమంలో భాగంగా సోమవారం అనకాపల్లి జిల్లా ఏపీటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు ధర్నా చేశారు. పాఠశాలలలో అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయులు పోరాడాలన్నారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ధర్నాలో కోరాన వాసు, టి.రామకృష్ణారావు, జగదీశ్, విజయశ్రీ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

'తక్షణమే ఇళ్ల స్థల పట్టాలు మంజూరు చేయాలి'

మల్కాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ తక్షణమే ఇళ్ల స్థల పట్టాలను మంజూరుచేయాలని మల్కాపురం సీపీఎం జోన్ కమిటీ ఆధ్వర్యంలో ములగాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు మాట్లాడారు. ఇళ్లపట్టాల జీవో 30 ప్రకారం 2019 అక్టోబరు ముందు ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇంటిపన్ను, కరెంటుబిల్లు, రేషన్‌కార్డు ఉంటేనే అర్హులుగా చెబుతున్నారని, 2024లో ఇళ్లు కట్టినవారికీ జీవో వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ భుజంగరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.పైడిరాజు, ఆర్.లక్ష్మణమూర్తి, పెంటారావు, సత్యనారాయణ, కోటేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

వైభవంగా పైడితల్లమ్మ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం

గోపాలపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతినగర్ లోని పైడితల్లమ్మ అమ్మవారి పండగలో భాగంగా సోమవారం సాయంత్రం తొలేళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. మహిళలు నూకాంబిక అమ్మవారి ఆలయం నుం చి ఉత్సవ ప్రతిమల్ని మేళతాళాలతో తోడ్కొని వచ్చారు. అనంతరం అమ్మవారి ప్రతిమలు, ఘటాల్ని ఊరేగించారు. అమ్మవారి ప్రతిమను తలకెత్తుకుని పశ్చిమ ఎమ్మెల్యే, ఆలయ ధర్మకర్త పి.గణబాబు ఆధ్వర్యంలో జరిగిన తొలేళ్ల ఉత్సవంలో భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తప్పెటగుళ్లు, కోలాటం తదితర సంప్రదాయ నృత్యాలతో ఊరేగింపు సాగింది. అర్ధరాత్రి దాటి తరువాత అమ్మవారికి విశేషాలంకరణ గావించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తెల్లవారుజామున 4 గంటల నుంచి దర్శనం కల్పిస్తారు. క్యూలైన్లు, బారికేడ్లు, పెండాల్‌లు ఏర్పాటు చేశారు.



అమ్మవారి ప్రతిమల ఊరేగింపులో పాల్గొన్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, భక్తులు

'హోమీబాబా' ఆస్పత్రిలో మొరాయించిన సర్వర్

తీవ్ర ఇబ్బందులకు గురైన క్యాన్సర్ రోగులు

అగనంపూడి, మే 5 (ఆంధ్రజ్యోతి): హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రిలో వైద్యం పొందేందుకు వచ్చిన పేద రోగులకు సోమవారం చుక్కలు కనిపించాయి. క్యాన్సర్ వైద్యం కోసం రోగులు రాష్ట్ర నలుమూలల నుంచి నిత్యం సుమారు ఐదు వందల మంది ఇక్కడకు వస్తుంటారు. వీరిలో అధికంగా పేదలే ఉంటుండడంతో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా ఉచితంగా వైద్యం పొందాలంటే ట్రస్టు ఆమోదం పొందాల్సి ఉంటుంది. అయితే సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్ మొరాయించడంతో రోగులు క్యూలో పడిగాపులు పడాల్సి వచ్చింది. పది నిమిషాలకొకసారి సర్వర్ మొరాయించడంతో ఒక్కొక్కరి ఆమోదానికి సుమారు గంట సమయం పట్టింది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. క్యాన్సర్ రోగులకు వారానికి ఒకసారి చేసే కీమో వైద్యానికి తప్పనిసరిగా ఎన్టీఆర్ ఆరోగ్య సేవా ట్రస్టులో ఆమోదం తీసు కోవాలి. అయితే సర్వర్ మొరాయించడంతో రోగులు అవస్థలు వర్ణనాతీతంగా మారింది. జిల్లా ఉన్నాతాధికారులు చొరవ తీసుకుని ఆస్పత్రిలో సర్వర్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పలువురు రోగులు కోరుతున్నారు.



క్యూలో వేచివున్న రోగులు, వారి కుటుంబ సభ్యులు

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

గాజువాక, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం చొరవ చూపకుండా, ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పిల్లా శంకరరావు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గాజువాక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు. అనంతరం తహశీల్దార్ శ్రీవల్లికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు కేవీ రాజు, ఎంఎస్ బాబు, ఎన్.బాబూరావు, వైఎన్ఎం రాజు, జేపీ రాజు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ చిన్నారులకు పోషకాహార కిట్ల పంపిణీ

గాజువాక, మే 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 72వ వార్డులో గల డిజైర్ సొసైటీలో గల హెచ్ఐవీ బాధిత చిన్నారులకు సోమవారం పోషకాహార కిట్లను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ లక్ష్మణ, ప్రతినిధులు గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, బొండా యల్లాజీరావు, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన పార్కింగ్ ఫీజులను రద్దు చేయాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, మే 5 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల సౌకర్యార్థం కూర్మన్నపాలెం ఆర్చి వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలోని ఫీజులను భారీగా పెంచారని, వీటిని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ జీఎం (టీపీ) చంద్రశేఖర్‌కు 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఇప్పటివరకు నిర్వాసిత దివ్యాంగులకు పార్కింగ్ స్థలాన్ని అప్పగించి కేవలం రెండు రూపాయలను మాత్రమే వసూలు చేసేవారని, కానీ ఇప్పుడు ఒక్కసారిగా రోజుకు రూ.36 వసూలు చేయడం సమంజసం కాదన్నారు. జీఎంను కలిసిన వారిలో సీఐటీయూ ప్లాంట్ నాయకులు ఉన్నారు.

నల్లి ధర్మారావుకు చందు సాహితీ సంస్థ అవార్డు

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన చందు ట్రస్ట్ ఏటా సాహితీవేత్తలకు ఇస్తున్న సాహిత్య పురస్కారాన్ని 2025 ఏడాదికి గాను రచయిత, కవి, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుకు అందజేయాలని ట్రస్ట్ కార్యవర్గం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ మేరకు సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ కేఎస్ చలం, కార్యదర్శి ఉప్పల అప్పలరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 18న ఉదయం 10 గంటలకు విశాఖ పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్న ప్రొఫెసర్ చందు సుబ్బారావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్ట్ వార్షికోత్సవ సభలో నల్లి ధర్మా రావుకు పురస్కారంతో పాటు రూ.10 వేలు, జ్ఞాపిక అందిస్తామన్నారు. సభకు నగరంలోని సాహితీవేత్తలు, కళాకారులకు ఆహ్వానం పలికారు.



నల్లి ధర్మారావు

సరస్వతీ నది పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తొలిసారి జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కాళేశ్వరం సమీపంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమం వద్ద పుష్కరాలు జరగనున్నాయని. ఈనెల 14,16,17 తేదీల్లో ద్వారకాబస్‌స్టేషన్ నుంచి పుష్కరాల ఘాట్ వరకు బస్సులు నడుపుతామని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. కాళేశ్వరం వెళ్లి వచ్చేందుకు ఒక్కరికి సూపర్ లగ్జరీలో రూ.2,500, అల్ట్రాడీలక్స్‌లో రూ.2,350, ఇంద్ర సర్వీసులో రూ.3వేలుగా టికెట్ నిర్ణయించామన్నారు.వివరాలకు 9959225602, 9959225594, 9100109731 నంబర్లలో సంప్రతించాలన్నారు.

పీజీఆర్ఎస్‌కు 8 వినతులు

వేపగుంట, మే 5(ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 వినతులు అందాయని జేడ్సీ కె.హైమావతి తెలిపారు. వీటిని సంబంధితశాఖాధిపతులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఎన్ఏడీ జంక్షన్, మే 5 (ఆంధ్రజ్యోతి): మర్రిపాలెం ఉడా కాలనీలో నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్, పార్కుల ఆధునికీకరణ పనులను కార్పొరేటర్ శ్రీధర్ పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 225 ఫిర్యాదులు

మహారాణిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 225 ఫిర్యాదులు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు 81, జీవీఎంసీ 79, పోలీసు 14, ఇతర శాఖలకు సంబంధించి 51 ఫిర్యాదులను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు స్వీకరించారు. వినతులు అందుకున్న కలెక్టర్ నేరుగా అర్జీదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వివిధ శాఖలలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, స్వర్ణాంధ్ర లక్ష్య సాధన సి4 సర్వే తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. సహేతుక కారణాలు లేకుండా ఫిర్యాదులు పెండింగ్‌లో పెడితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని కలెక్టర్ పునరుద్ఘాటించారు. అనంతరం బాల్య వివాహాల నివారణ ఆవశ్యకతపై సమావేశం నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటీ వారు నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాల గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీ శంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలను ఆలకిస్తున్న కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఇతర అధికారులు

పోలీసు కమిషనరేట్‌లో 102 ఫిర్యాదులు

పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి 102 ఫిర్యాదులు స్వీకరించారు. కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాధితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడుతూ చట్టబద్ధ విచారణ జరిపి ఫిర్యాదులు పరిష్కరించాలన్నారు.

దివ్యాంగుల పింఛన్ రూ.15 వేలు ఇవ్వాలి

దివ్యాంగులకు రూ.15 వేల వంతున పింఛన్ అందించాలని విశాఖ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించింది. పోలియో కారణంగా మంచానికే పరిమితమై, ఇతరులపై ఆధారపడి జీవిస్తున్నాం.. ఏ పనీ చేసుకోలేని దీనస్థితిలో ఉన్నామని పేర్కొంటూ పింఛన్ పెంచాలని కోరారు.

ఉపాధి కల్పించరూ!

విశాఖ స్టీల్‌ప్లాంట్ సీఈడీ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికులుగా 30 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాం. గత అక్టోబరులో టెండరు రద్దు కావటంతో ఏడు నెలలుగా సుమారు 150 మంది ఉపాధి లేక కుటుంబాలతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులతో మాట్లాడి తమ సమస్యను పరిష్కరించాలని కాంట్రాక్టు కార్మికులు కలెక్టర్‌ను కోరారు.

మాజీ డిప్యూటీ మేయర్‌పై ఫిర్యాదు

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అక్రమాలు, భూ ఆక్రమణలపై విచారణ చేపట్టాలని 22వ వార్డు కార్పొరేటర్ పీతలమూర్తి యాదవ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 52వ వార్డు ఢిల్లీ పబ్లిక్ స్కూలు ఉన్న భూమి ప్రభుత్వానిదని, దీనికి జీవీఎంసీ అనుమతిలేదని, మద్దిపాలెం జర్నలిస్టుకాలనీలో 330 గజాల స్థలం ఆక్రమించుకుని రెండు భవనాలు నిర్మించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పిఠాపురం కాలనీ కళాభారతికి ఆనుకుని వాణిజ్య భవనాలు నిర్మించి అక్రమంగా వ్యాపారం చేస్తున్న అసోసియేషన్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని మరో ఫిర్యాదు చేశారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వండి

సుజాతనగర్ టీచర్స్ లేఅవుట్ బర్డన్ నగర్‌లో వెనుకబడిన వర్గాలకు చెందిన సుమారు 150 కుటుంబాలు తాటాకు షెడ్లు వేసుకొని నివాసం ఉంటున్నాం. జీవీఎంసీకి ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నందున తమకు ఇళ్ల పట్టాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఆనందపురంలో క్వార్ట్జైట్ తవ్వకాలకు సన్నాహాలు

» పర్యావరణ అనుమతులు లేకుండానే హడావిడి » కొండ వద్ద సీపీఎం ఆందోళన

విశాఖపట్నం/ఆనందపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ ఇచ్ఛాపురంలో క్వార్ట్జైట్ తవ్వకాలకు కాంట్రాక్టరు సన్నాహాలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో వేలం ద్వారా 15 ఎకరాల్లో క్వారీయింగ్‌కు బిడ్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు గనుల శాఖ ఇంకా అనుమతి ఇవ్వలేదు. అయినా తవ్వకాలకు సన్నాహాలు చేస్తుండడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇచ్ఛాపురం గిరిజన గ్రామానికి ఆనుకుని 400 ఎకరాల్లో విస్తరించిన కొండను స్థానికులు దెయ్యాల కొండగా పిలుస్తారు. కుసులవాడ గ్రామానికి సమీపంలోనే ఉంది. సమీపంలో ఉన్న మరో కొండపై ఇద్దరికి మెటల్ క్వారీకి అనుమతులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దెయ్యాలకొండపై క్వార్ట్జైట్ గనుల తవ్వకానికి 2022 సెప్టెంబరులో గనుల శాఖ వేలం వేయగా నెల్లూరుకు చెందిన అగ్నిసు ముఖ్ మార్కెటింగ్ కంపెనీ 20 ఏళ్ల లీజుకు దక్కించుకుంది. దీనికి రెవెన్యూ అధికారులు 2022లోనే 15 ఎకరాలకు మార్కింగ్ చేసి ఎన్‌వోసీ ఇచ్చేశారు. తరువాత వేలంలో కంపెనీ పాల్గొని బిడ్ దక్కించుకుంది. కొండపై తవ్వకాలు చేయాలంటే పర్యావరణ అనుమతి ఉండాలి. కాంట్రాక్టరు అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ నుంచి అనుమతుల కోసం దరఖాస్తు చేశారు. ఇంతవరకు ప్రజాభిప్రాయ సేకరణ జరపకపోవడంతో. గనులశాఖ నుంచి అనుమతులు జారీ కాలేదు. అయినా కంపెనీ తవ్వకాలకు సన్నాహాలు చేస్తుండంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు గ్రామస్థులతో కలిపి సోమవారం కొండను సందర్శించి ఆందోళన చేపట్టారు. అనంతరం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.


క్వారీకి అనుమతులు ఇచ్చిన కొండ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికులకు మజ్జిగ అందజేస్తున్న రమేష్‌చంద్ జైన్ తదితరులు

డాబాగార్డెన్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండు వేసవిలో మంచినీరు, మజ్జిగ పంపిణీ పాదచారులు, ప్రయాణికులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని భారత్ వికాస్ పరిషత్ జాతీయ ప్రతినిధి రమేష్‌చంద్ జైన్ అన్నారు. సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని 11వ నెంబర్ ప్లాట్‌ఫారం వద్ద ఉచిత మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ, ఝాన్సీ లక్ష్మీ భాయి మహిళా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. దీన్ని ప్రారంభించిన జైన్ మాట్లాడుతూ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికుల దాహార్తి తీర్చవచ్చన్నారు. భారత వికాస్ పరిషత్ ప్రతినిధులు పంపాన వెంకటేశ్వరరావు, ఎం.వి.రాజశేఖర్, టీవీ నాగేశ్వరరావు, ఎం.సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ శ్రీధర్‌ను తొలగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన జియ్యాని శ్రీధర్‌ను జీవీఎంసీ కార్యాలయం నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇతనిపై కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం గతనెల 26న జరిగిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో ఆమోదం పొందింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీచేసింది.

విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన

అక్కయ్యపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార మండలంలోని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్‌ను విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకురాలు పి.జయలక్ష్మి, సీఎంవో పి.దేముడుబాబు సోమవారం సందర్శించారు. స్టాక్ పాయింట్ నిర్వహణ పద్ధతి చూసి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఈవో బాలామణి ఉన్నారు.

18న దుర్గమ్మ మహోత్సవం

అక్కయ్యపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): కైలాసపురం రోడ్డు శాంతినగర్‌లో ఈ నెల 18న దుర్గమాంబ అమ్మవారి జాతర మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త అప్పారావు తెలిపారు. 16 గ్రామాల ఇలవేల్పుగా పూజలందుకుంటున్నారని చెప్పారు. ఆ రోజు తెల్లవారు జామునే అమ్మవారికి పసుపు కుంకుమలతో అభిషేకాలు జరుపుతారని, సాయంత్రం అమ్మవారి ఘటాలు, నేల నృత్యాలు, బాణసంచా ఊరేగింపు ఉంటుందన్నారు. రాత్రి జానపద గీతాలు, సినీ సంగీత విభావరి, రేలా రేలా.. తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, 23న మహా అన్నసమారాధన జరుగుతుందన్నారు.

సకాలంలో అర్జీలు పరిష్కరించండి: జెడ్సీ రాము

జ్ఞానాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ ద్వారా వచ్చే ప్రజాసమస్యలు సకాలంలో పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ చూపాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము ఆదేశించారు. సోమవారం జోనల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆరు ఫిర్యాదులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్‌కు 3, పబ్లిక్ హెల్త్‌కు 2, రెవెన్యూ విభాగానికి 1 అర్జీలు రాగా సంబంధిత అధికారులకు పంపారు. రెవెన్యూ ఏసీ బాబురావు, రాజ్యలక్ష్మి, సహాయ వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, ఏపీడీలు కృపానందం, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి బాల్యం కేంద్రాల నిర్వహణ బాధ్యత తప్పించండి

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని బాల్యంకేంద్రాల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌కు అప్పగించడం సరికాదని జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు మేయర్ పీలా శ్రీనివాసరావుకు సోమవారం ఫిర్యాదుచేశారు. ఈ కేంద్రాల పర్యవేక్షణను గతంలో ఒక సీనియర్ స్కూల్ అసిస్టెంట్ చూసేవారని, ఇప్పుడు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి కి అదనపు కమిషనర్ ఎస్ఎస్‌వర్మ అప్పగించారని ఆరోపించారు. అక్కడితో ఆగకుండా డిప్యూటీ డీఈఓ చాంబర్‌ను ప్రస్తుతం కంప్యూటర్ ఆపరేటర్‌కు కేటాయించడాన్ని బట్టి అదనపు కమిషనర్‌కు అతని పట్ల ప్రత్యేకశ్రద్ధ ఉందని అర్థమవుతోందన్నారు. తక్షణం శాశ్వత ఉద్యోగికి బాల్యం బాధ్యతలను అప్పగించాలని కోరారు. యూనియన్ అధ్యక్షుడు ఎం.ఆనందరావు, నాయకులు ఆర్.సత్యం, శ్రీనివాసరావు, నాయుడు తదితరులున్నారు.

'సేవా వారధి ప్రియదర్శిని'

విశాఖపట్నం లీగల్, మే 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆదివారం హైదరాబాద్‌లో మృతి చెందిన తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శినికి విశాఖతో ఎంతో అనుబంధం ఉంది. నగరానికి చెందిన ఆమె విద్యార్థి దశ నుంచీ సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు. న్యాయ విద్య పూర్తిచేసి అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేసిన తరువాత వైఎస్ మెన్స్ క్లబ్ నిర్మల హృదయం అనే సేవా సంస్థను స్థాపించి దివ్యాంగులు, పేదలు, మహిళల అభ్యున్నతికి కృషి చేశారని సీనియర్ న్యాయవాది ఐఎం. అహ్మద్ నివాళులర్పించారు. విశాఖలోని ఎన్‌బీఎం న్యాయకళాశాలలో బీఎల్ చేసిన ప్రియదర్శిని తరువాత లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లాలో మాస్టర్స్ డిగ్రీ చేసి ఇక్కడి బార్‌లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ప్రియదర్శిని మృతి పట్ల పలువురు న్యాయవాదులు తీవ్ర సంతాపం తెలిపారు.

ఉపాధ్యాయులకు బోధన సామర్థ్యం పెంపుపై శిక్షణ

మహారాణిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులలో మెరుగైన బోధన, సాంకేతిక భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు క్షమతా సామర్థ్య వృద్ధి వర్కుషాపులు నిర్వహించనున్నట్లు కోట్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ప్రతినిధి గణేష్ రాజా తెలిపారు. సోమవారం దసపల్లా హిల్స్ వద్ద సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమం వివరాలను తెలియజేశారు. ఈ శిక్షణ ద్వారా సాంఘిక సంక్షేమ విద్యా సంస్థలు, గురుకుల పాఠశాలలు, మహాత్మా గాంధీ జ్యోతిబా పూలే వెల్ఫేరు రెసిడెన్షియల్ సంస్థలలో విద్యా ప్రమాణాలు పెంచవచ్చన్నారు. ఉపాధ్యాయులలో డిజిటల్ విద్యా నైపుణ్యాలు, స్వీయ నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తుందని తెలిపారు. సమావేశంలో డాక్టర్ పి.ఫర్తీజ్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య సమస్యకు పరిష్కారం

... 5వ పేజీ తరువాయి

అది డంపింగ్ యార్డుగా మారింది. దాంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా రాత్రిపూట వాహనాల్లో వ్యర్థాలను తీసుకువచ్చి అక్కడ పడేస్తుండేవారు. గుర్తుతెలియని వ్యక్తులు తరచూ వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో పరిసర గ్రామాల వాసులు ఇబ్బందిపడుతుండేవారు. పొగ కారణంగా వృద్ధులు, చిన్నారులు అస్వస్థతకు గురై, శ్వాసకోశ వ్యాధుల బారినపడేవారు. అక్కడ చెత్తను తొలగించాల్సిందిగా జీవీఎంసీ, ఐలా అధికారులకు ప్రజలు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పరిష్కారానికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో జనవరి 28న వడ్లపూడిలో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన "అక్షరం అండగా, పరిష్కారమే అజెండా..." కార్యక్రమంలో పాల్గొన్న అధికారుల దృష్టికి స్థానికులు ఈ సమస్యను తీసుకువచ్చారు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. స్పందించిన కార్పొరేటర్ బొండా జగన్ కాలనీ వాసులతో కలిసి డంపింగ్ యార్డు వద్ద ఆందోళన చేసి, సమస్యను ఏఎంహెచ్ఓ కిరణ్‌కుమార్, 'ఐలా' కమిషనర్ అయినవిల్లి కిషోర్ దృష్టికి తీసుకువెళ్లారు. కమిషనర్ కిషోర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చొరవచూపారు. అక్కడ చెత్తను తొలగించి, ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు రూ.7 లక్షలు మంజూరుచేశారు. ఈ పనులను ప్రారంభించారు. ఇప్పటికే అక్కడ సెక్యూరిటీని పెట్టామని, ప్రహరీని పూర్తిగా నిర్మించాక వ్యర్థాలను కాపులుప్పాడ తరలిస్తామని, సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేస్తామని ఐలా కమిషనర్ అయినవిల్లి కిషోర్ పేర్కొన్నారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్య పరిష్కారానికి చొరవ చూపిన 'ఆంధ్రజ్యోతి'కి తిరుమలనగర్, సిద్ధార్థ నగర్, కాలనీల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అక్కడ ఇప్పటికే ఉన్న చెత్తా, చెదారాన్ని పూర్తిగా తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉన్నత క్రీడాకారులుగా ఎదగాలి

» క్రీడాశిక్షణ శిబిరాల ప్రారంభ సూచికగా కలెక్టర్ పోస్టర్ల ఆవిష్కరణ


వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ప్రారంభ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్ తదితరులు


ఫుట్‌బాల్ శిక్షణ ప్రారంభం సందర్భంగా బంతిని నెడుతున్న జూన్ గ్యాలియట్ తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) నిర్వహిస్తున్న వార్షిక వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా కలెక్టర్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ హరేంధిర ప్రసాద్ తన కార్యాలయంలో శిక్షణ శిబిరాల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. నెలాఖరు వరకు జరిగే ఈ శిబిరాలలో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి దీర్ఘకాలిక శిక్షణ ఇచ్చి ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యతను కోచ్‌లు తీసుకోవాలన్నారు. చిన్నారులు దృఢ సంకల్పంతో సాధన చేసి ఉన్నత క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. క్రీడా నైపుణ్యంతోపాటు క్రమశిక్షణ, చిత్తశుద్ధి, అంకితభావం పెంపొందేలా వివిధ రూపాలలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నుంచి ఏటా జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు తయారు కావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. డీఎస్ఏ కోచింగ్ క్యాంపులను కొనసాగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్‌వో భవానీ శంకర్, డీఎస్‌డీవో జూన్ గ్యాలియట్ పాల్గొన్నారు.

28 క్రీడాంశాలలో శిక్షణ

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ 28 క్రీడాంశాలలో అందిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాలలో భాగంగా ఏయూ గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ శిబిరాన్ని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ గ్యాలియట్ ప్రారంభించారు. ఇందులో సుమారు 80 మంది చిన్నారులు ప్రాతినిధ్యం వహించి ఫుట్‌బాల్ క్రీడలో శిక్షణ పొందడం ఆనందదాయకమని గ్యాలియట్ పేర్కొన్నారు. ఫుట్‌బాల్‌తోపాటు అథ్లెటిక్స్, బాక్సింగ్, ఫెన్సింగ్, కరాటే, యోగా, చెస్ వంటి క్రీడల్లో ప్రారంభమైన శిక్షణ శిబిరాలను పరిశీలించారు.

ఆయుష్ కేంద్రాల్లో పంచకర్మ వైద్యం

... 5వ పేజీ తరువాయి

పూండి, సింగుపురం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలోని బొండపల్లి, కోమటిపల్లి, బూర్జ, అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, కన్నూరుపాలెం, నర్సీపట్నం కేంద్రాల్లో ఈ సేవలు ప్రారంభం కానున్నాయి.

ఈ వ్యాధులకు వైద్యం..

పంచకర్మ వైద్యం అందించేందుకు సిబ్బందిని నియమించారు. మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో 23 ఆరోగ్య మందిరాలకు పురుష, మహిళా థెరపిస్టులను నియమించారు. పంచకర్మ వైద్యంలో వమనం, విరేచన, హస్తి, నస్య, రక్తమోచన అనే ఐదు రకాల చికిత్సతో వ్యాధులను నయంచేస్తారు. దీర్ఘకాలిక వ్యాధులకు కూడా సేవలందిస్తారు. ప్రధానంగా సొరియాసిస్, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, తలనొప్పి, బొల్లి వ్యాధి, సైనసైటిస్, సయాటికా, పక్షవాతం వంటి వ్యాధులకు ఈ వైద్యం అందిస్తారని ఆర్డీడీ తెలిపారు.

ఖాకీ అడ్డదారి!

... 5వ పేజీ తరువాయి

పోస్టింగ్ ఇచ్చింది. ఆ సమయంలో అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. రికవరీల్లో కొంత ఇవ్వాలని ఎస్ఐలపై ఒత్తిడి చేసేవారని, స్క్రాప్ దుకాణాల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేయాలని ఆదేశించే వారని ఆరోపణలున్నాయి. ఇటీవల ప్రత్యేక ఇంటెలిజెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు.

సొంత పనులకు గన్‌మెన్

కాగా సదరు అధికారి రక్షణ కోసం ప్రభుత్వం కేటాయించిన గన్‌మెన్‌ను వ్యక్తిగత పనులకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెందుర్తి సమీపంలో ఈ అధికారి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అందులో ఇంటీరియర్, కార్పెంటర్ పనులు చేస్తున్న వారికి సహాయకులుగా ఉండాలని ఇద్దరు గన్‌మెన్‌ను ఆదేశించారు. పెంపుడు కుక్కలను చూసుకునే బాధ్యత కూడా గన్‌మెన్‌లకే అప్పగించారని తెలిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం అన్నవరం వద్ద గిరిజనుడి పేరుతో ప్రైవేటు రిసార్టు నిర్మిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటిపై కొందరు ఇటీవల ఆధారాలతో సహా ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో వారు ప్రత్యేక దృష్టిసారించారని పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది.

ఈపీడీసీఎల్ అత్యుత్సాహం

... 5వ పేజీ తరువాయి

ఆర్ఈసీఎస్ చైర్మన్, ఎండీ ఒక తీర్మానం చేసి అక్కడి ఉద్యోగులకు కూడా పీఆర్‌సీ ప్రకారం జీతాలు ఇచ్చేసేవారు. అంతా కుమ్మక్కు కావడం వల్ల ఎవరూ ప్రశ్నించలేదు. ఇన్నాళ్లూ నడిచిపోయింది. అయితే మూడేళ్ల క్రితం ఆర్ఈసీఎస్‌ను ఈపీడీసీఎల్‌కు అప్పగించింది. ఆపరేషన్ వ్యవహారాలన్నీ ఈపీడీసీఎల్ చూస్తోంది. బిల్లులు కూడా వసూలు చేసి అక్కడి ఉద్యోగులకు జీతాలు ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 2022లో పీఆర్‌సీ ఇచ్చింది. అప్పటికే ఆర్ఈసీఎస్ వ్యవహారాలపై కోర్టు వివాదాలు నడుస్తుండడంతో దాని గురించి అక్కడి ఉద్యోగులు ఎవరూ మాట్లాడలేదు. ఇప్పుడు స్థానిక నేతలను పట్టుకున్నారు. పాత తీర్మానాల ప్రకారం పీఆర్‌సీని అమలు చేస్తూ జీతాలు ఇచ్చేయడానికి రంగం సిద్ధం చేశారు. ఇందుకు అనకాపల్లి ఎస్ఈ ప్రతిపాదనలు పంపడం, విశాఖలోని కార్పొరేట్ కార్యాలయం ఆమోదించడం జరిగిపోయింది. ఇంతలో లుకలుకలు మొదలు కావడంతో ఒక అడుగు వెనక్కి వేశారు. అయితే ఇప్పటికే చాలామంది ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో పెరిగిన జీతాలు పడిపోయాయి. ఎవరూ నోరు విప్పడం లేదు.

అది చట్ట విరుద్ధం

సొసైటీలో అర్హతల ప్రామాణికంగా కాకుండా రాజకీయ సిఫారసులతో ఉద్యోగాలు ఇచ్చారు. ఈపీడీసీఎల్‌లో రిక్రూట్‌మెంట్ ద్వారా నియామకాలు జరుగుతున్నాయి. వీరితో సమానంగా సొసైటీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి నిబంధనలు ఒప్పుకోవు. అందుకని పాత పాలకవర్గం అప్పట్లో చేసిన తీర్మానం ప్రకారం 2022 పీఆర్‌సీ అమలు చేస్తున్నామని నోట్ తయారుచేసి, దాని ప్రకారం అందరికీ జీతాలు పెంచేశారు. ఇది కూడా తప్పే. ప్రస్తుతం సొసైటీకి స్వయంగా జిల్లా కలెక్టరే పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆమె అందుకు ఎలా అంగీకరించారనేది అర్థం కావడం లేదు. ఆ జిల్లా ఎస్ఈ సొసైటీ ఇన్‌చార్జి ఎండీగా వ్యవహరిస్తున్నారు. వారిపై రాజకీయ ఒత్తిళ్లు పెట్టి పీఆర్‌సీ అమలు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది.

తేలుకుట్టిన దొంగల్లా...

పీఆర్‌సీ అమలుపై ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వివరణ కోరితే, సొసైటీ నుంచి ప్రతిపాదనలు వచ్చాయని, బిల్లులు పెడితే ఎప్పటిలాగే ఇచ్చామని, తమ తప్పు ఏమీ లేదని, ప్రత్యేక ఉత్తర్వులు ఏవీ లేవని 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అనకాపల్లి జిల్లా అధికారిని వివరణ కోరితే, కార్పొరేట్ కార్యాలయమే జీతాలు విడుదల చేసిందని, తమ ప్రమేయం ఏమీ లేదని, పాత పాలకవర్గం తీర్మానం ఆధారంగా చేసుకొని పీఆర్‌సీ ఇచ్చామని తెలిపారు. జిల్లా స్థాయి సహకార శాఖ అధికారిని దీనిపై ప్రశ్నిస్తే...ఆర్ఈసీఎస్‌కు పీఆర్‌సీ వర్తించదని చాలా స్పష్టంగా చెప్పారు.

పదవీ విరమణ వయస్సు పెంపునకు నిరాకరణ

ఇటీవల అనకాపల్లి నేత ఒకరు ఆర్ఈసీఎస్ ఉద్యోగుల పట్ల ప్రత్యేక ప్రేమ చూపిస్తూ వారికి పదవీ విరమణ వయస్సు 58 నుంచి 62 ఏళ్లకు పెంచాలని సహకార సంస్థకు రాశారు. దీనిపై కమిషనర్ చట్టాలన్నీ పరిశీలించి, అలా కుదరదని, ప్రభుత్వ ఉద్యోగుల్లా 62 ఏళ్ల చేయలేమని గత నెలలో ఫైల్ వెనక్కి తిప్పి పంపించారు. ఇదే సొసైటీలో అక్రమాలపై విచారణ చేయాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో కోరితే ప్రభుత్వం 51ఏ విచారణకు ఆదేశించింది. ఒక వైపు విచారణ జరుగుతూ, మరో వైపు ఆపరేషన్లన్నీ ఈపీడీసీఎల్‌కు అప్పగించిన నేపథ్యంలో అక్కడి ఉద్యోగులకు పీఆర్‌సీ ఎలా ఇస్తారనేది అర్థం కాని వ్యవహారం. ఈ విషయంలో లోపాయికారీ ఒప్పందాలు భారీగా జరిగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు కూడా చేశారు.

క్రీడా ప్రాంగణాలు ప్రైవేటుకు ధారాదత్తం

... 5వ పేజీ తరువాయి

చూస్తుందని ప్రకటించారు. కానీ జీవీఎంసీలో ఓ ఉన్నతాధికారి తన అస్మదీయుడికి లబ్ధి చేకూర్చేందుకు లీజు పేరుతో అప్పగించారు. భారీగా ఫీజులు నిర్ణయించడంతో సాధారణ, మధ్య తరగతి క్రీడాకారులు సాధనకు దూరమయ్యారు. బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రెండు స్విమ్మింగ్‌పూల్స్ ఉన్నాయి. వాటిని జీవీఎంసీ నిర్వహించేది. పెద్దలకు నెలకు రూ.200, చిన్నారులకు రూ.100 చొప్పున ఫీజు వసూలుచేసేవారు. ఇక్కడ సాధన చేసినవారిలో ఎంతోమంది రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటారు. కరోనా సమయంలో దీనిని మూసివేయడంతో మరమ్మతులకు గురైంది. తర్వాత రూ.2.5 కోట్లు వెచ్చించి ఆధునికీకరించారు. ఇది అందుబాటులోకి వస్తే స్విమ్మింగ్ సాధనకు అవకాశం ఉంటుందని అంతా ఆశపడ్డారు. చివరకు స్పోర్ట్స్ ఎరీనాను దక్కించుకున్న వ్యక్తికే బినామీ పేరుతో అప్పగించారు. ఉదయం, సాయంత్రం నిర్దిష్ట సమయాల్లో జీవీఎంసీ నిర్ణయించిన ఫీజు, తర్వాత నిర్వాహకులకు నచ్చిన మొత్తం వసూలుచేసుకునేలా వెసులుబాటు కల్పించారు. దీనిని అలుసుగా తీసుకుని మూడు నెలలు ఫీజు చెల్లించాలని షరతు పెట్టడంతో చాలామంది సాధనకు దూరమయ్యారు.

స్వర్ణభారతిదీ అదే దారి...

మద్దిలపాలెం సమీపంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం పరిస్థితి ఇలాగే ఉంది. ఇక్కడ వందలాది మంది బ్యాడ్మింటన్, కిక్‌బాక్సింగ్ సాధన చేస్తుంటారు. వీరంతా ఏడాదికి రూ.వెయ్యి చొప్పున జీవీఎంసీకి ఫీజుగా చెల్లించేవారు. నిపుణులైన కోచ్‌లు మెలకువలు నేర్పుతుంటారు. ఈ స్టేడియానికి జీవీఎంసీ రూ.15 కోట్లతో సీటింగ్, ఫ్లోరింగ్, ఏసీ ప్లాంటు, లైటింగ్ సిస్టమ్ వంటి హంగులు కల్పిస్తోంది. పనులు చివరిదశకు చేరడంతో ఈ నెలలో ప్రారంభించేందుకు జీవీఎంసీ కసరత్తు చేస్తోంది. దీనిపైనా ప్రైవేటు వ్యక్తుల కన్ను పడినట్టు ప్రచారం జరుగుతోంది. అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని క్రీడా సంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. మేయర్ పీలా శ్రీనివాసరావు దృష్టి సారించి జీవీఎంసీ ఆధ్వర్యంలోనే నిర్వహణ సాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని మళ్లీ ఆవిష్కరించాలి: దళితుల డిమాండ్

మహారాణిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): చిన్న ముషిడివాడలో ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీ వద్ద తొలగించిన అంబేడ్కర్ విగ్రహాన్ని మళ్లీ ఆవిష్కరించాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలో ఉమ్మడిగా ఉన్న 250 గజాల ప్రభుత్వ స్థలాన్ని మినీ పార్కుగా అభివృద్ధి చేయడంతోపాటు అంబేడ్కర్ విగ్రహాన్ని అక్కడ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు నిర్ణయించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.లక్ష్మి వెంకటేశ్వర్లు, చిన్నారావు, దుర్గారావు పాల్గొన్నారు.

76వ వార్డులో భూ ఆక్రమణ

జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు బాల చెరువు బీజేఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇటీవల ఉక్కు భూములు ఆక్రమణకు గురయ్యాయని కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం ఇందుకు సంబంధించిన ఆధారాలను కలెక్టర్‌కు అందజేశారు. స్థానికంగా ఉన్న ఉక్కు ఉద్యోగి ఆక్రమణకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు.

ఘనంగా దాసరి జయంతి వేడుకలు


దాసరి నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నిర్వాహక సభ్యులు

సీతంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో తెలుగు సినిమా దర్శకుడు దాసరి నారాయణరావు 78వ జయంతి వేడుకలను, తెలుగు సినిమా డైరెక్టర్స్ దినోత్సవాన్ని వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సొసైటీ ప్రతినిధులు కాశీవిశ్వేశ్వరరావు, నరవ ప్రకాశరావు, మీగడ శివశ్రీ, డాక్టర్ మీగడ రామలింగ స్వామి, డాక్టర్ బీఎం నాయుడు, సూరపనేని విజయకుమార్, రఘురామారావు తదితరులు హాజరై దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు దాసరి గొప్పతనాన్ని, ఆయన సినీ రంగానికి చేసిన సేవలు, దర్శకత్వంలో తీసిన చిత్రాలను గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో బి.చిన్నారావు, హుస్సేన్, డాక్టర్ బాబ్జి, చాట్ల బాబురావు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష గొప్పతనం చాటిచెప్పాలి

మేయర్ పీలా శ్రీనివాసరావు

సిరిపురం, మే 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాష గొప్పతనం ప్రపంచ దేశాలకు చాటిచెప్పాలని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. ఈనెల 10, 11 తేదీల్లో ఏలూరులో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జరగనున్న అంతర్జాతీయ తెలుగు మహా సంబరాల గోడ పత్రికను సోమవారం తన చాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. తెలుగు భాషను కాపాడుకునే ఇటువంటి సభా కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళావేదిక గౌరవ అధ్యక్షుడు సత్తివాడ శ్రీకాంత్, కార్యదర్శి సత్యాడ నర్సింగరావు, రత్నంరామ్‌గోపాల్, ఇమంది నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు. కాగా నగర మేయర్ పీలా శ్రీనివాసరావును జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఏఐటీయూసీ కార్యవర్గం సోమవారం సత్కరించింది. జీవీఎంసీలో దీర్ఘకాలికంగా ఉన్న కార్మిక ఉద్యోగుల సమస్యలపై మెమొరాండం సమర్పించారు. దీర్ఘకాలికంగా పెండింగ్ ఇంక్రిమెంట్లు, జోనల్ కార్యాలయాలు, ఇతర శాఖలలో ఖాళీగా ఉన్న గుమస్తాలను నియమించాలని, పబ్లిక్ హెల్త్ విభాగం మలేరియాలో సీజనల్ మ్యాన్ పవర్ కాంట్రాక్ట్‌ను ఎస్ఎల్ఎఫ్ సంస్థలకు నామినేషన్ పద్ధతిలో అప్పగించడం హెచ్ఎంసీ చట్టం ప్రకారం విరుద్ధమని తదితర 10 డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రం ద్వారా కోరారు.


మేయర్‌ను సత్కరిస్తున్న ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యులు

ఆనందపురంలో క్వార్ట్‌జైట్ తవ్వకాలకు సన్నాహాలు

- పర్యావరణ అనుమతులు లేకుండానే హడావిడి
- కొండ వద్ద సీపీఎం ఆందోళన

విశాఖపట్నం/ఆనందపురం, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ ఇచ్ఛాపురం గ్రామంలో క్వార్ట్‌జైట్ తవ్వకాలకు కాంట్రాక్టరు సన్నాహాలు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో వేలం ద్వారా 15 ఎకరాల్లో క్వారీయింగ్‌కు బిడ్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు గనుల శాఖ ఇంకా అనుమతి ఇవ్వలేదు. అయినా తవ్వకాలకు సన్నాహాలు చేస్తుండడంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్ఛాపురం గిరిజన గ్రామానికి ఆనుకుని 400 ఎకరాల్లో విస్తరించిన కొండను స్థానికులు దెయ్యాల కొండగా పిలుస్తారు. కుసులవాడ గ్రామానికి సమీపంలోనే ఈ కొండ ఉంది. కుసులవాడలో ఉన్న మరో కొండపై ఇద్దరు వ్యక్తులకు మెటల్ క్వారీకి అనుమతులు ఉన్నాయి. ఈనేపథ్యంలో దెయ్యాలకొండపై క్వార్ట్‌జైట్ గనులు తవ్వకాలకు 2022 సెప్టెంబరులో గనుల శాఖ వేలం వేయగా నెల్లూరుకు చెందిన అగ్నిసుముఖ్ మార్కెటింగ్ కంపెనీ 20 ఏళ్ల పాటు లీజుకు దక్కించుకుంది. దీనికి రెవెన్యూ అధికారులు 2022లోనే 15 ఎకరాలకు మార్కింగ్ చేసి ఎన్‌వోసీ ఇచ్చేశారు. తరువాత వేలంలో కంపెనీ పాల్గొని బిడ్ దక్కించుకుంది. కొండపై తవ్వకాలు చేయాలంటే పర్యావరణ అనుమతి ఉండాలి. కాంట్రాక్టరు అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ నుంచి అనుమతుల కోసం దరఖాస్తు చేశారు. ఇంతవరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించకపోవడంతో. గనుల నుంచి అనుమతులు జారీ కాలేదు. అయినా కంపెనీ తవ్వకాలకు సన్నాహాలు చేస్తుండంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా సీపీఎం నాయకులు గ్రామస్థులతో కలిపి సోమవారం కొండను సందర్శించి ఆందోళన చేపట్టారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.


పనులు జరగనున్న కొండ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

‘20 లక్షల ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి’

సిరిపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత యువత సంక్షేమం కోసం 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అన్నారు. గత ప్రభుత్వం ఏపీపీఎస్సీని నిర్వీర్యం చేసిందన్నారు. యువత శక్తి సామర్థ్యాలు సమాజాభివృద్ధికి ఉపయోగిస్తే ఎన్నో సంచలనాలు చేయవచ్చున్నారు. బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించి వైసీపీ నేతలు జైలు పాలైన విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రీడాభివృద్ధికి సహకరిస్తాం



వెంకోజీపాలెం/ఎండాడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : క్రీడలకు విశాఖ నగరం ఎంతో అనుకూలమైనదని, క్రీడాకారులకు, క్రీడలకు ప్రోత్సాహం అందిస్తానని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. నగరానికి చెందిన అంతర్జాతీయ క్రీడాకారిణి శ్రీసాహితి (13) రోలర్ ఆర్టిస్టిక్ స్కేటింగ్‌లో పతకాలు సాధించినందుకు మేయర్ ఆమెను అభినందించారు.

మహిళను రక్షించిన లైఫ్‌గార్డులు

మద్దిలపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణ బీచ్‌లో సోమవారం మధ్యాహ్నం ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. ఇది గమనించిన బీచ్ లైఫ్ గార్డులు ఆమెను సముద్రం లోపలకు వెళ్లకుండా అడ్డుకుని త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ పైడయ్య వివరాలు ఆరా తీశారు. విమాన్‌నగర్‌కు చెందిన రాజాన సీతామహాలక్ష్మిగా గుర్తించారు. ఆమెకుమారుడు విజయ్‌కుఫోన్‌లో విషయం చెప్పడంతో అతడు తల్లిని తీసుకువెళ్లాడు.

‘సేవా వారధి ప్రియదర్శిని’

విశాఖపట్నం లీగల్, మే 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆదివారం హైదరాబాద్‌లో మృతిచెందిన తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ మాటూరి గిరిజా ప్రియదర్శినికి విశాఖతో ఎంతో అనుబంధం ఉంది. నగరానికి చెందిన ఆమె విద్యార్థి దశ నుంచీ సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవారు. న్యాయ విద్య పూర్తిచేసి అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేసిన తరువాత వైఎస్ మెన్స్ క్లబ్ నిర్మల హృదయం అనే సేవా సంస్థను స్థాపించి దివ్యాంగులు, పేదలు, మహిళల అభ్యున్నతికి కృషి చేశారని సీనియర్ న్యాయవాది ఐఎం.అహ్మద్ నివాళులర్పించారు. ప్రియదర్శిని మృతి పట్ల పలువురు న్యాయవాదులు తీవ్ర సంతాపం తెలిపారు.

‘భెల్’ భూముల సంరక్షణకు గజిటెడ్ అధికారి

అక్కిరెడ్డిపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల సంరక్షణ చట్టం 1971 ప్రకారం భెల్ హెచ్‌పీవీపీ స్థలాల సంరక్షణ కోసం గజిటెడ్ స్థాయి అధికారిని నియమించేందుకు కేంద్ర భారీ పరిశ్రమల శాఖ ఈ నెల 1న నోటిఫికేషన్ విడుదల చేసింది. చిన గంట్యాడ పంచాయతీ పరిధిలో తుంగ్లాం, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, మింది సరిహద్దుల్లో ఉన్న 381 ఎకరాల స్థలంలో ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపట్టేందుకు అధికారిని నియమించనున్నారు.

సినిమా గైడ్

- **హిట్** : జగదాంబ, సంగం, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిలిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **రెట్రో** : మెలోడి, శరత్, శ్రీకన్య, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి)
- **అర్జున్ సన్నాఫ్ వైజయంతి** : సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **ఓదెల-2** : శ్రీలీలామహల్, సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **కోర్ట్** : వెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 26, పచ్చిమిర్చి 20, కాకరకాయలు 34, బీరకాయలు 34, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 28, క్యాబేజి 13, క్యారెట్ 28 దొండకాయలు 26, బంగాళదుంపలు 20, అరటికాయ 8, మునక్కాడలు (కిలో) 48, అల్లం 46, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 125, బద్దచిక్కుడు 42, దోసకాయలు 18, వెల్లుల్లి 100, కొబ్బరికాయ 25, బీన్స్ 70, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ 28, చేమదుంపలు 28 చిలగడదుంపలు 34, కంద 80, దేముడుచిక్కుడు 44, గోరుచిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 45, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట)3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	130
లైవ్ ధర	150
విత్ స్కిన్	270
స్కిన్‌లెస్	280

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 300 వినతులు

వెంకోజీపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి) : మేయర్ పీలా శ్రీనివాసరావు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 300 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పోలమాంబ అమ్మవారి జాతర



మద్దిలపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి) : శివాజీపాలెంలోని పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర సోమవారం శ్రీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారి ఆలయం నుంచి ఘటబంగారాన్ని కృష్ణుడు ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఆలయం వద్ద గరిడీ, పులి వేషాలు, దాండియా నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి పుష్పాలంకరణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దువ్వి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బుద్ధల కృష్ణ, కోశాధికారి దువ్వి వెంకటస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శి చెల్లిబోయిన సునీల్‌కుమార్, కార్యదర్శులు మువ్వల మౌళి, ఎం.హరిప్రసాద్, సాంబశివరావు, ఒమ్మి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

‘కార్మిక హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం’

ఆరిలోవ మే 5 (ఆంధ్రజ్యోతి): కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమిద్దామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వీ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం బీఎస్‌ఆర్ నగర్‌లో నరేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన మే డే సభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక హక్కులను కాలరాస్తోందన్నారు.ఈ నెల 20న సమ్మెకు ప్రజలు సంఘీభావం తెలపాలని కోరారు.తొలుత కళారూపాల ప్రదర్శన ఆకట్టుకుంది.

బాల్యం కేంద్రాల నిర్వహణ బాధ్యతలు మార్చండి

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని బాల్యం కేంద్రాల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌కు అప్పగించడం సరికాదని జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు మేయర్ పీలా శ్రీనివాసరావుకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ కేంద్రాల పర్యవేక్షణను గతంలో ఒక సీనియర్ స్కూల్ అసిస్టెంట్ చూసేవారని, ఇప్పుడు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగికి అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ అప్పగించారని ఆరోపించారు. డిప్యూటీ డీఈఓ చాంబర్‌ను కేటాయించడాన్ని బట్టి అదనపు కమిషనర్ శ్రద్ధ అర్థమవుతోందన్నారు. యూనియన్ అధ్యక్షుడు ఎం.ఆనందరావు, నాయకులు ఆర్.సత్యం, శ్రీనివాసరావు, నాయుడు తదితరులున్నారు.

వివాహిత ఆత్మహత్య

మల్కాపురం, మే 5 (ఆంధ్రజ్యోతి): వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన సోమవారం ములగాడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ములగాడకి చెందిన జీవన్‌కుమార్, కొత్తనక్కావానిపాలెం నకు చెందిన పద్మజ (22) ప్రేమించుకుని రెండేళ్ల కిందట పెళ్లి చేసుకున్నారు. వీరి ఎనిమిది నెలల బాబున్నాడు. సోమవారం జీవన్‌కుమార్ పనిమీద బయటకు వెళ్లాడు. పద్మజ మామ మనవడికి పాలు తెచ్చేందుకు వెళ్లారు. అదే సమయంలో పద్మజ ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరివేసుకుంది. ఇంటికి తిరిగి వచ్చిన మామ పిలిచినా పలకకపోవడంతో కిటికీలోంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. స్థానికుల సాయంతో బలవంతంగా తలుపులు తెరిచి, పద్మను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

‘రాజీవ్ గృహకల్ప కాలనీలో సమస్యలు పరిష్కరించాలి’

భీమునిపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 4వ వార్డు నేరెళ్లవలస రాజీవ్ గృహ కల్ప కాలనీలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని వామపక్షాల నాయకులు కోరారు. సోమవారం జోన్ వన్ కార్యాలయంలో జడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వారు వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, అన్నాబత్తుల నరసింగరావు మాట్లాడుతూ కాలనీలో 2,4,8,10,12 బ్లాక్‌లలో తాగునీటి సమస్య ఉందని చెప్పారు. బ్లాక్‌ల మధ్యలో తుప్పలు పెరగడంతో పాములు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కాలువలు పూడిక పోయాయని, రోడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. కాగా పీజీఆర్ఎస్‌కు మొత్తం ఆరు వినతులు అందాయని జోనల్ కార్యాలయం అధికారులు చెప్పారు. వాటిలో ఇంజనీరింగ్‌కు 3, రెవెన్యూకు 2, యూసీడీకి 1 ఫిర్యాదు అందిందన్నారు.

కుట్టు శిక్షణతో మహిళల ఆర్థికాభివృద్ధి

ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ మే 5 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ బతుకుతెరువుకు ఎంతగానో ఉపకరిస్తుందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. సోమవారం సంతపాలెం కమ్యూనిటీ హాల్‌లో బి.సి. కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. శిక్షణ మూడు నెలలు ఉంటుందన్నారు. కుట్టు శిక్షణ నైపుణ్యం సాధిస్తే పాఠశాల విద్యార్థుల యూనిఫారాలు కుట్టేందుకు కాంట్రాక్ట్ అవకాశం తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తేవాలని కోరారు. టీడీపీ నాయకులు ఒమ్మి సన్యాసిరావు, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, నంబారి గోపి తదితరులు పాల్గొన్నారు. ఆరిలోవ చివరి బస్సు స్టాప్ వద్ద గల కల్యాణ మండపంలోనూ కుట్టు శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ నాయకులు ధర్మారావు, సురేష్, మజ్జి రమణి, బాలస్వామి పాల్గొన్నారు.


కుట్టు శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

మత్స్యకారులకు ప్రభుత్వం భరోసా : ఎమ్మెల్యే వంశీకృష్ణ

బీచ్‌రోడ్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఫిషింగ్ హార్బర్ వద్ద ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేట నిషేధ సమయంలో జీవనాధారం కోల్పోతున్న జాలర్ల కుటుంబాలకు ప్రభుత్వం రూ.20 వేల చొప్పున సాయం అందించడం గొప్పవిషయమని చెప్పారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. జీవన ప్రమాణాల మెరుగుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని, సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం మత్స్యకారులకు రూ.13.12 కోట్ల చెక్కును అందజేశారు. మత్స్యశాఖ సహాయ సంచాలకుడు పి.లక్ష్మణరావు, జీవీఎంసీ జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, ఫిషింగ్ బోటు ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు, పి.సి.అప్పారావు, జనసేన నాయకులు గరికిన రవి, కార్పొరేటర్ అహ్మద్ షాద్విక్, కె.చిన్నా తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

పదవీ విరమణ ప్రయోజనాల కోసం కలెక్టర్‌కు వినతి

పెదవాల్తేరు. మే 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన కార్పొరేషన్‌లో అధికారిగా పనిచేసిన తాను 15 సంవత్సరాల కిందట ఉద్యోగ విరమణ పొందినప్పటికీ నేటికీ జీసీసీ యాజమాన్యం తనకు పదవీ విరమణ ప్రయోజనాలు ఇవ్వలేదని శేఖరమంత్రి ఆదినారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు జరిగిన అన్యాయాన్ని సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. తాను గతంలో జీసీసీ ఫైనాన్స్ జనరల్ మేనేజర్‌గా పని చేసినప్పుడు ఆదాయపన్ను శాఖ నుంచి పలుసార్లు నోటీసులు వచ్చాయన్నారు. అటవీ ఉత్పత్తులను అమ్మే వ్యాపారుల వద్ద టీడీఎస్ వసూలు చేయకపోవడంతో అప్పుడు తమకు ఆదాయ పన్ను శాఖ రూ.1.35 కోట్ల అపరాధ రుసుము విధించిందన్నారు. తాను కమిషనర్‌ను కలవగా ఆయన సూచన మేరకు మినహాయింపులు పోను రూ.39 లక్షలను ఆదాయ పన్నుల శాఖకు చెల్లించామన్నారు. ఈ విషయాన్ని అప్పటి జీసీసీ పరిపాలన బోర్డుకు నివేదించినా వారు తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా తనకు రావలసిన పదవీ విరమణ ప్రయోజనాలను 15 ఏళ్లుగా ఆపేశారని, తన సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

పిల్లల చదువు బాధ్యత చూడండి

కలెక్టర్‌కు పిళ్ళా ఉమామహేశ్వరరావు తండ్రి వినతి

మధురవాడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై గోడ కూలి మృతి చెందిన పిళ్లా ఉమామహేశ్వరరావు, శైలజ దంపతులు పెంచుకుంటున్న పిల్లల చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని ఉమామహేశ్వరరావు తండ్రి అప్పలనాయుడు కలెక్టర్‌ను కోరారు.

సోమవారం ఆయన గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. ఉమామహేశ్వరరావు, శైలజ దంపతులకు పిల్లలు లేకపోవడంతో వితంతువు అయిన తన చెల్లెలు పిల్లలు నిహాల్, ధార్మికను పెంచుకొని, వారి బాగోగులు చూసుకుంటున్నారని తెలిపారు.గోడ కూలిన ఘటనలో భార్యాభర్త మృతి చెందడంతో పిల్లల భవిష్యత్తు అంధకారంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలిద్దరూ మధురవాడలోని ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారని, వారికి ప్రభుత్వ సహాయంతో విశాఖ వేలీ స్కూలులో చదివించాలని ఆయన కోరారు.

కాలువల మూసివేతపై ఫిర్యాదు

మధురవాడ, మే 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డు మానం ఆంజనేయనగర్‌లో ఒక వ్యక్తి కాలువలు, రహదారులను మూసివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేశ్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ లేఅవుట్‌లో ఉన్న రోడ్లు, కాలువలను ఒక వ్యక్తి మూసివేయడంతో మురుగు నీరు నిల్వ ఉండి కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై గతంలో వీఎం ఆర్డీఏ చైర్మన్, జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, అధికారులు కాలనీకి వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసినప్పటికీ ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెప్పారు.

సరస్వతీ నది పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, మే 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తొలిసారి జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కాళేశ్వరం సమీపంలో గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమం వద్ద పుష్కరాలు జరగనున్నాయని. ఈనెల 14,16,17 తేదీల్లో ద్వారకా బస్‌స్టేషన్ నుంచి పుష్కరాల ఘాట్ వరకు బస్సులు నడుపుతామని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. కాళేశ్వరం వెళ్లి వచ్చేందుకు మనిషి ఒక్కంటికి సూపర్ లగ్జరీలో రూ.2,500, అల్ట్రాడీలక్స్‌లో రూ.2,350, ఇంద్ర సర్వీసులో రూ.3వేలుగా టికెట్ నిర్ణయించామన్నారు. వివరాలకు 9959225602, 9959225594, 9100109731 నంబర్లలో సంప్రతించాలన్నారు.

నల్లి ధర్మారావుకు చందు సాహితీ సంస్థ అవార్డు


నల్లి ధర్మారావు

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన చందు ట్రస్ట్ ఏటా సాహితీవేత్తలకు ఇస్తున్న సాహిత్య పురస్కారాన్ని 2025 ఏడాదికి గాను రచయిత, కవి, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుకు అందజేయాలని ట్రస్ట్ కార్యవర్గం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఈ మేరకు సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ కేఎస్ చలం, కార్యదర్శి ఉప్పల అప్పలరాజు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 18న ఉదయం 10 గంటలకు విశాఖ పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్న ప్రొఫెసర్ చందు సుబ్బా రావు లిటరరీ అండ్ కల్చరల్ ట్రస్ట్ వార్షికోత్సవ సభలో నల్లి ధర్మారావుకు పురస్కారంతో పాటు రూ.10వేలు, జ్ఞాపిక అందిస్తామన్నారు.

డిప్యూటీ మేయర్ శ్రీధర్‌ను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

విశాఖపట్నం, మే 5 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌గా పనిచేసిన జియ్యాని శ్రీధర్‌ను జీవీఎంసీ కార్యాలయం నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇతనిపై కూటమి కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం గతనెల 26న జరిగిన కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో ఆమోదం పొందింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీచేసింది.

‘కరాచీ బేకరీ పేరును మార్చాలి’

ఎంవీపీ కాలనీ, మే 5 (ఆంధ్రజ్యోతి): ఓ పక్క భారతీయులను కిరాతకంగా పాకిస్థానీయులు చంపేస్తుంటే, ఇక్కడ కరాచీ పేరుతో బేకరీ నడపడం సిగ్గుచేటని జనజాగరణ సమితి సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ఎంవీపీ కాలనీలోని కరాచీ బేకరీ ఎదుట సోమవారం సమితి సభ్యులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. దేశంలో ఉన్న అన్ని సంస్థల కరాచీ పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. పాకిస్థాన్‌లో బెనారస్ పేరుతో వ్యాపారాలు చేస్తే, వారు సహిస్తారా? అని ప్రశ్నించారు. పేర్లను తొలగించకపోతే వాటిని పెట్రోల్ పోసి తగులబెడతామని హెచ్చరించారు. వ్యాపారాలకు వ్యతిరేకం కాదని, పేరు మార్చాలని డిమాండ్ చేశారు. జనజాగరణ సమితి కన్వీనర్ వాసు, సభ్యులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణ అందరి బాధ్యత

ఎంవీపీ కాలనీ, మే 5 (ఆంధ్రజ్యోతి): జీవ వైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. సోమవారం సాయంత్రం ఎంవీపీ కాలనీలోని ఉషోదయ కూడలిలో పర్యావరణ పరిరక్షణ మాసోత్సవం నిర్వహించారు. సామాజిక వనాలు పెంచడానికి అందరూ కృషిచేయాలని కోరారు. భూమి మీద ఉన్న సమస్త జీవరాశిని కాపాడుకోవాలన్నారు. ఈ నెలలో పర్యావరణ పరిరక్షణ కోసం పిచ్చుకలకు గూళ్ల ఏర్పాటుచేయడంతో పాటు, పక్షులు, ఇతర జీవులకు నీరు అందుబాటులో ఉంచాలని, ఆహారంగా ధాన్యం కంకుల కుచ్చులు తయారుచేసి, పక్షులకు కనిపించే విధంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కాదలచుకుంటే ఫోన్ 83338 49955 నెంబరుకు తమ వివరాలను వాట్సాప్ చేయాలని తెలిపారు. ప్రముఖ చిత్రకారిణి పూర్వీ రజాక్, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, వాలంటీర్లు రాజేశ్వరి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

చందనోత్సవంపై పాట విడుదల

ఎంవీపీ కాలనీ, మే 5 (ఆంధ్రజ్యోతి): చందనోత్సవంపై కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్- ఏ ఐ) సాంకేతిక పరిజ్ఞానంతో ఎంవీపీ కాలనీలోని విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ సంస్థ ఓ పాటను సోమవారం విడుదల చేసింది. డాక్టర్ మణిభూషణ్ రచన, దర్శకత్వంలో రూపొందించిన ఈ పాటను డైరెక్టర్స్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు. టూరిజం ఫౌండేషన్ సీఈఓ సీతారామస్వామి, ఎడిటర్ నీరజభూషణ్, సీనియర్ జర్నలిస్ట్ నేమాల హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతి

పెదవాల్తేరు, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం చినగదిలి తహసీల్దార్ కార్యాలయంలో ఎన్ఎంయూఏ నాయకులు డివిజనల్ కార్యదర్శి ఏకే శివాజీ, డిపో చైర్మన్ బి.రవి, కార్యదర్శి వసంతరావు, కమిటీ సభ్యులుతహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, త్వరలో రాబోయే ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ ఉద్యోగుల ద్వారా నడపాలని, ఉద్యోగులకు పాత విధానంలో వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. నైట్ అవుట్ అలవెన్స్‌లను రూ.400లకు పెంచాలని, అన్యాయంగా సస్పెన్షన్లు, తొలగింపులు లేకుండా, నాన్ ఆపరేషన్, గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఏయూను సందర్శించిన సమాచార హక్కు కమిషనర్

వెంకోజీపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ శామ్యూల్ జోనాథన్ సోమవారం ఏయూను సందర్శించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌కి ‘గుంటూరు.. త్రూ ద ఏజెస్’ అనే పుస్తకాన్ని బహూకరించారు. ఏయూ శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా ఇదే తరహా పుస్తకాన్ని తయారు చేయడానికి ఆయన ఆసక్తి వ్యక్తం చేశారు. ఏయూ ఉపకులపతి దృష్టికి దీన్ని తీసుకువెళ్లి అనుమతి తెలియజేస్తామని రిజిస్ట్రార్‌తో అన్నారు. అనంతరం పలు అంశాలపై వీరు చర్చించారు.

జిల్లా పశు సంవర్ధక శాఖాధికారుల నూతన కార్యవర్గం

ఆరిలోవ, మే 5 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి విశాఖ జిల్లా పశు సంవర్ధక శాఖాధికారుల నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం ఆ శాఖ సంయుక్త సంచాలకుడు కార్యాలయంలో జరిగింది. అధ్యక్షుడిగా డాక్టర్ ఆర్. సింహాద్రిప్పడు, కార్యదర్శిగా డాక్టర్ సీహెచ్ ఎంఎం గంగాధర్, కోశాధికారిగా డాక్టర్ బి. సౌజన్య, ఉపాధ్యక్షుడిగా పి. చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీగా పి.రాజాగోపాల్ ఎన్నికయ్యారు.